మీకు ఆస్థి ఉండి
తగినంత రుణ సదుపాయం
పొందలేక పోతున్నారా?
ఉచిత సలహాలకై
మమ్మల్ని సంప్రదించండి
6303988189

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్




RNI No.52722/90 సంపుటి : 32 సంచిక : 296 విశాఖపట్నం, 17 సెప్టెంబరు 2022 శనివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00
Circulated at Visakhapatnam, Hyderabad, Vijayawada, Guntur, Tirupati, East Godavari, West Godavari, Kadapa, Nellore, Srikakulam, Vizianagaram, Yanam, Bhubaneswar, Raipur

## కేంద్రం కంటే ఏపీలో ఆర్థిక పరిస్థితి మెరుగు: సీఎం

ఏపీలో ఆర్థిక పరిస్థితి నానాటికీ దిగజారుతోందంటూ విపక్షాలు నిత్యం విమర్శలు చేస్తున్న వేళ..వాస్తవ పరిస్థితిని ప్రజలకు వివరించేందుకు వైసీపీ సర్కార్ ఇవాళ అసెంబ్లీలో కీలక చర్చ చేపట్టింది. రాష్ట్ర ఆర్థిక నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందన్న విమర్శల్ని తిప్పికొట్టేందుకు సభలో వైసీపీ ఎమ్మెల్యేలు,మంత్రులు ప్రయత్నించారు. చివరగా ముగింపు ప్రసంగం చేసిన సీఎం జగన్.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై విపక్షాలు, ఎల్లో మీడియా కలిసి అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్రం ఆర్థిక పరిస్థితి కూడా అంతంత మాత్రమేనన్నారు.

జగన్ కీలక ప్రసంగం రాష్ట్ర ఆర్థిక నిర్వహణ అనేది చాలా పెద్ద సవాలని సీఎం జగన్ ఇవాళ అన్నారు. కేంద్రంతో పోలిస్తే ఏపీ చేసిన అప్పు గణనీయంగా తగ్గిందని అసెంబ్లీలో చేసిన ప్రసంగంలో తెలిపారు. కేంద్రం కంటే మెరుగ్గానే ఏపీ ఆర్థిక వ్యవస్థ ఉందన్నారు. అన్ని రకాలుగా రాష్ట్రం ఇబ్బందుల్లో ఉందని పరిస్థితులు మెరుగ్గా లేవని దుష్ప్రచారం జరుగుతోందన్నారు. రాష్ట్రం బాగున్నా శ్రీలంక తరహాలో పరిస్థితులు ఉన్నాయని కొందరు లేనిది సృష్టిస్తున్నారని జగన్ ఆరోపించారు. కోవిడ్ ఉన్నా ఏపీ స్థూల ఉత్పత్తి గణనీయంగానే పెరిగిందన్నారు. 2021-22లో 11.43 శాతం జీఎస్డీపీ పెరుగుదలతో ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. గడచిన మూడేళ్లలో సగటున 5 శాతం పెరిగిందన్నారు.

ఏపీతో సహా నాలుగు రాష్ట్రాల్లో తలసరి ఆదాయ వృద్ధి కనిపిస్తే మిగతా రాష్ట్రాల్లో తిరోగమనంలో ఉన్నాయని జగన్ గుర్తుచేశారు. కొనుగోలు శక్తి పడిపోకుండా అమ్మఒడి, చేయూత, ఆసరా, రైతు భరోసా లాంటి పథకాలు పనికి వస్తున్నాయన్నారు. నాడు నేడు కార్యక్రమం ద్వారా మూల ధన వ్యయం చేస్తున్నామని, అసాధారణ స్థాయిలో అప్పులు చేస్తున్నారని విపరీతంగా దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఇందులో నిజం ఎంతుందో ప్రజలంతా తెలుసుకోవాలన్నారు. గతంలో రుణాల పెరుగుదల సాలీనా 17.4 శాతం ఉంటే ప్రస్తుతం 12.7 శాతం మాత్రమే పెరుగుదల ఉందన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక 3,82,165 కోట్లు మాత్రమే రుణాలు తీసుకున్నామన్నారు. ప్రభుత్వ గ్యారెంటీల తో కార్పోరేషన్ల ద్వారా తీసుకున్న రుణాలు 1,17,730 కోట్లు మొత్తం అప్పు 4,99,895 కోట్లకు చేరాయని, మూడేళ్లలో పెరిగిన రాష్ట్ర రుణం 52.07 శాతం మాత్రమేనన్నారు.

కేంద్రంతో పోల్చినా ఏపీ బెటర్



జీడీపీలో రుణ శాతం దేశ సగటుతో పోలిస్తే గణనీయంగా తగ్గిందని జగన్ గుర్తుచేశారు. కేంద్ర రుణాలు- రాష్ట్ర రుణాలూ పెరిగిన తీరును చూసినా ఏపీ పనితీరు అవగతం అవుతుందన్నారు. రాష్ట్రం విడిపోయే నాటికి రాష్ట్ర రుణం 1.20 లక్షల కోట్లు ఉంటే చంద్రబాబు హయాంలో 2,69,462 కోట్లకు పెరిగాయన్నారు. అంటే చంద్రబాబు ప్రభుత్వంలో 123.53 శాతం మేర రుణాలు పెరిగాయని జగన్ విశ్లేషించారు. 2019 మే 31 తేదీనాటికి ఉన్న ఏపీకి ఉన్న అప్పులు 2,69,462 కోట్లు అయితే.. మూడేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో 2022 మార్చి 31 నాటికి ఉన్న రుణం 3,82,165 కోట్లు మాత్రమే అని జగన్ తెలిపారు. కోవిడ్ లాంటి ప్రత్యేక పరిస్థితులు ఉన్నా ఏపీ గణనీయంగా వృద్ధి సాధించిందని గుర్తుచేశారు.

అప్పులపై దుష్ప్రచారం భారీగా అప్పులు చేస్తున్న ప్రభుత్వం ఎలా చెల్లిస్తుందనే దుష్ప్రచారం కూడా చేస్తున్నారని విపక్షాలపై జగన్ మండిపడ్డారు. రుణాలకు వడ్డీల కింద 21,499 కోట్లు, రుణంగా 14,558 కోట్లు చెల్లించామన్నారు. అలాగే రాష్ట్ర రెవెన్యూ 2021-22 ఆర్థిక సంవత్సరానికి 75,696 కోట్లు వచ్చిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో వృద్ధి రేటు పరుగులు పెడుతోందని, రాష్ట్ర రెవెన్యూ కూడా గణనీయంగా పెరుగుతోందన్నారు. ఐదేళ్ల కాలపరిమితి ముగిసే సమయానికి గత ప్రభుత్వం కంటె మెరుగైన పనితీరు కనపరుస్తామని జోస్యంచెప్పారు. మూలధన వ్యయం గురించిన దుష్ప్రచారం కూడా చేస్తున్నారని ఆక్షేపించారు. సంక్షేమ పథకాలు, ప్రజాకర్షకర పథకాల పైనే డబ్బులు వ్యయం చేస్తున్నారని ఆరోపణలు చేస్తున్నారని, ఇదంతా అవాస్తవమన్నారు. మూడేళ్లలో మూలధన వ్యయంగా భారీ మొత్తాన్నే ఖర్చు చేశామన్నారు. విద్య, వైద్యం, నాడు-నేడు కార్యక్రమాలు, వ్యవసాయ రంగాలకు ఈ వ్యయం చేశామన్నారు. మూల ధన వ్యయం కింద 2014- 19 వరకూ 76,139 కోట్లు వ్యయం చేస్తే, గడచిన మూడేళ్లలోనే తమ ప్రభుత్వం 55,086 కోట్ల రూపాయలు ఖర్చు చేసిందన్నారు. 15 ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు (మిగతా 2లో)

## విద్యా సంస్థల్లో కామన్ డ్రెస్ కోడ్‌పై విచారణ జరపలేం



**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా ప్రభుత్వం వద్ద నమోదైన విద్యా సంస్థల్లో సిబ్బంది, విద్యార్థులకు కామన్ డ్రెస్ కోడ్ అమలు చేసేలా ఆదేశాలు జారీ చేయాలన్న ప్రజాహిత వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు తోసి పుచ్చింది. కామన్ డ్రెస్ కోడ్ తప్పనిసరి చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు మార్గదర్శకాలు జారీ చేయాలన్న విజ్ఞప్తిపై విచారణకు నిరాకరించింది.

లౌకికతత్వాన్ని కాపాడేందుకు అంటూ దేశంలో జాతీయ సమగ్రతను, సమానత్వం, సోదరభావాన్ని పెంపొందించడానికి కామన్ డ్రెస్ కోడ్ అవసరమంటూ నిఖిల్ ఉపాధ్యాయ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. పాఠశాలలు, విద్యా సంస్థల్లో లౌకికతత్వాన్ని కాపాడేందుకు ఇది అవసరమని పేర్కొన్నారు. ఇది రాజ్యాంగానికి (మిగతా 2లో)

## అమరావతిలో అక్రమాలంటూ మూడేళ్లుగా ఆరోపిస్తున్నారే తప్ప ఒక్క ఆధారమైనా చూపించారా ?: జీవీఎల్



అమరావతిలో అక్రమాలంటూ మూడేళ్లుగా ఆరోపణలు చేస్తున్న వైసీపీ ప్రభుత్వం ఇప్పటి దాకా ఒక్క ఆధారం కూడా చూపించలేదని బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు విమర్శించారు. రాష్ట్రంలో మూడు రాజధానుల విధానం సాధ్యం కాదని సీఎం జగన్ కు, వైసీపీ సర్కారుకు తెలుసని అన్నారు. అయినప్పటికీ, మూడేళ్లుగా వేసిన కేసెట్టే మళ్లీ మళ్లీ వేస్తున్నారని వ్యాఖ్యానించారు.

విశాఖపట్నంలో రాజధాని అంటున్నారు... అక్కడ భూ దందాలు చేయడానికా? అని ప్రశ్నించారు. నిజంగా అభివృద్ధి చేయాలనుకుంటున్నవాళ్లయితే విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణం పట్ల ఎందుకు పట్టించుకోవడంలేదని నిలదీశారు. విశాఖ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనేక సహాయసహకారాలు అందాల్సి ఉంది... కానీ అందడంలేదు అని ఆరోపించారు. విశాఖ అభివృద్ధికి సహకరించని (మిగతా 2లో)

## విజయనగరంలో హైకోర్టు న్యాయమూర్తి పర్యటన

**విజయనగరం:** రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ రెండు రోజుల జిల్లా పర్యటనకోసం శనివారం ఉదయం జిల్లాకు వస్తున్నట్టు జిల్లా జడ్జి బి.సాయికళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ శనివారం తెల్లవారు ఝామున 4.20 గంటలకు నగరానికి చేరుకొని జిల్లాపరిషత్ అతిథిగృహంలో బసచేస్తారని పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు రామతీర్థం ఆలయాన్ని సందర్శించి అక్కడ సుదర్శన హెూమం, ధన్వంతరి హెూమం నిర్వహిస్తారని పేర్కొన్నారు. 11 గంటలకు నగరంలోని పైడితల్లి అమ్మవారి ఆలయాన్ని దర్శిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 1.30 గంటలకు జిల్లా కోర్టుకు చేరుకొని 2 నుంచి 4 గంటల వరకు కోర్టు ఆవరణలో పర్యటిస్తారని వెల్లడించారు. అనంతరం అతిథిగృహానికి చేరుకొని బస చేస్తారని తెలిపారు.

18న ఉదయం 10 గంటలకు సాలూరు చేరుకొని పంచముఖేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించి పూజలు నిర్వహిస్తారని, 11.30 గంటలకు బొబ్బిలి చేరుకొని శ్రీవేణుగోపాల స్వామి ఆలయాన్ని దర్శిస్తారని తెలిపారు. 12 గంటలకు బొబ్బిలి కోటను సందర్శిస్తారని, మధ్యాహ్నం 1.30 గంటలకు బొబ్బిలి కోర్టు కాంప్లెక్సును సందర్శిస్తారని పేర్కొన్నారు. అక్కడి పాత, కొత్త కోర్టు భవనాలను పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం విజయనగరం చేరుకొని సాయంత్రం 5.30 గంటలకు రామనారాయణం సందర్శిస్తారని తెలిపారు. రాత్రి 9 గంటలకు బయలుదేరి విజయవాడ వెళతారని పేర్కొన్నారు.

## లిథియం సెల్ కర్మాగారాన్ని సందర్శించిన కేంద్రమంత్రి చంద్రశేఖర్

**తిరుపతి, (విశాఖ సమాచారమ్):** భారతదేశం 2025-26 నాటికి 300 బిలియన్ డాలర్ల విలువైన ఎలక్ట్రానిక్స్ తయారీ ఎగుమతుల లక్ష్యాన్ని సాధించగలదని ఉద్ఘాటిస్తూ, కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ శుక్రవారం అందరి భాగస్వామ్యంతో పనిచేయడానికి కట్టుబడి ఉన్నారని అన్నారు. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి ఉన్న స్టార్టప్‌లు వ్యవస్థాపకులకు మద్దతు ఇవ్వడానికి రాష్ట్రాల సమన్వయంతో లక్ష్యాలను చేరుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.



తిరుపతిలోని ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో మునోత్ ఇండస్ట్రీస్, భారతదేశపు మొట్టమొదటి లిథియం సెల్ తయారీ కేంద్రం చంద్రశేఖర్ సందర్శించారు.

ఆయన మాట్లాడుతూ "ఈ పుణ్యభూమి అయిన తిరుపతి - శ్రీవేంకటేశ్వరుని నివాసస్థలం కావడం గౌరవం విశేషం. అది కూడా మన గౌరవ ప్రధాని గారి పుట్టినరోజుకి ఒకరోజు ముందు నేను ఇక్కడ ఉండడం ఆనందం. నాకు వ్యక్తిగతంగా తిరుపతి ఈఎంసీలో భారతదేశపు మొట్టమొదటి లిథియం సెల్ తయారీ కర్మాగారంలో ఉండటం చాలా హర్షనీయం.

"2025-26 నాటికి 300 బిలియన్ డాలర్ల విలువైన ఎలక్ట్రానిక్ తయారీ ఎగుమతుల లక్ష్యాన్ని అధిగమించడమే మన దృష్టి, లక్ష్యం. ఇది 25 లక్షల కోట్ల రూపాయలకు సమానం, 2014లో ప్రధాని మోదీ బాధ్యతలు స్వీకరించినప్పుడు 1.10 లక్షల కోట్లు మాత్రమే, లక్ష్య గణాంకాలు ఇప్పుడు ఉన్న దానికంటే 24 రెట్లు ఎక్కువ" అని ఆయన అన్నారు.

ప్రభుత్వ చురుకైన విధానాలు బాగా క్రమాంకనం చేయబడిన కార్యక్రమాలు ప్రతి స్టార్టప్‌కు, ప్రతి వ్యవస్థాపకుడికిదేశపు ఈ కలను సాకారం చేయడానికి తోడ్పడతాయని ఆయన అన్నారు.

లిథియం-అయాన్ ఫ్యాక్టరీ యొక్క వాణిజ్య ఉత్పత్తి అధికారిక ప్రారంభోత్సవం వచ్చే నెలలో జరగనుంది. ప్రస్తుతం ప్లాంట్ స్థాపిత సామర్థ్యం 270 ఎండబ్ల్యూహెచ్ రోజూ 10ఎహెచ్ సామర్థ్యం గల 20,000 సెల్‌లను ఉత్పత్తి చేయగలదు. (మిగతా 2లో)

## ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పదవికి కోలగట్ల వీరభద్రస్వామి నామినేషన్



ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పదవికి కోన రఘుపతి రాజీనామా చేసిన నేపథ్యంలో, ఎన్నిక జరగనుంది. ఈ ఉదయమే నోటిఫికేషన్ విడుదల అయింది. ఈ నేపథ్యంలో, డిప్యూటీ స్పీకర్ పదవికి వైసీపీ తరపున కోలగట్ల వీరభద్రస్వామి ఈ సాయంత్రం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. నామినేషన్లకు ఈ సాయంత్రం వరకు గడువు ఉంది.

కాగా, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక సోమవారం జరగనుంది. ఈ పదవికి టీడీపీ నుంచి పోటీ ఉండదని తెలుస్తోంది. దాంతో కోలగట్ల ఎన్నిక ఏకగ్రీవం కావడం ఖాయంగా కనిపిస్తోంది. కాగా, సామాజిక సమీకరణాల నేపథ్యంలోనే, కోన రఘుపతిని డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేయాలని వైసీపీ హైకమాండ్ కోరినట్టు సమాచారం.

## తెలుగు భాష అమలుకు పెద్దమనసుతో కృషి చేయండి



**విజయనగరం:** పాలనా వ్యవహారాల్లో తెలుగు భాష అమలుకు ప్రతీ ఒక్కరూ పెద్ద మనసుతో కృషి చేయాలని, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ ఛైర్మన్ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ కోరారు. మూడు నెలల్లో ఖచ్చితమైన మార్పు రావాలని ఆయన ఆదేశించారు. తెలుగు భాషావృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నారని అభినందించారు.

ప్రభుత్వ శాఖల్లో తెలుగు భాష అమలుపై, ఆయన కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆయా శాఖల్లో తెలుగు అమలు శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ, భాషకు సేవ చేసిన వారి పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందని అన్నారు. ఆదికవి నన్నయ చేత మహాభారతాన్ని తెలుగులో అనువదింపచేసిన రాజరాజ నరేంద్రుడు, నంది తిక్కన కారణంగా మనుమసిద్ధి, తన పాలనలో తెలుగు భాషకు స్వర్ణయుగం తెచ్చిన శ్రీకృష్ణదేవ రాయులు లాంటి మహారాజులు చరిత్రలో శాశ్వత స్థానాన్ని సంపాదించారని చెప్పారు. విద్యలనగరమైన విజయనగరం కూడా తెలుగుభాషకు గొప్ప సేవ చేసిందన్నారు. మహాకవి గురజాడ అప్పారావు, చాగంటి సోమయాజులు, రోణంకి అప్పలస్వామి, పురిపండా అప్పలస్వామి, గిడుగు రామ్మూర్తి పంతులు, ఆదిభట్ల నారాయణదాసు లాంటి మహనీయుల సాహితీ సేవను కొనియాడారు. ఆంధ్ర రాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు డాక్టర్ బెజవాడ గోపాలకృష్ణ, పివి నర్సింహరావు, జలగం వెంగళరావు, ఎన్‌టిరామారావు, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తెలుగు భాషాభివృద్ధికి చేసిన సేవలను వివరించారు. వైఎస్ జగన్ మోహనరెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత అధికార భాషా సంఘాన్ని పునరుద్ధరించడమే కాకుండా, భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను ఏర్పాటు చేసి, తెలుగు భాష అమలుపై తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని అన్నారు. ఇంతే కాకుండా, తెలుగు అకాడమీ పునరుద్ధరణ, నెల్లూరులో తెలుగు భాష అధ్యయన కేంద్రం ఏర్పాటుకు 5 ఎకరాల స్థలాన్ని ఉచితంగా కేటాయించారని చెప్పారు.

పాలనా వ్యవహారాల్లో తెలుగు భాష వాడకాన్ని విస్తృతం చేసేందుకు రాష్ట్రస్థాయిలో కూడా కృషి జరుగుతోందని చెప్పారు. దీనిపై ఇప్పటికే రాష్ట్ర గవర్నర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో చర్చించినట్లు చెప్పారు. ప్రభుత్వం జారీ చేసే జీఓలు, ఇతర ముఖ్యమైన పత్రాలను తెలుగులోకి అనువదించేందుకు, అమరావతిలో భాషా నిపుణులతో తర్జుమా కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. చట్టం ప్రకారం ప్రతీ షాపు, వాణిజ్య సంస్థ, తెలుగులో తప్పనిసరిగా బోర్డు పెట్టాలని, దీనికి కార్మిక శాఖ, వాణిజ్య పన్నుల శాఖ కృషి చేయాలని కోరారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు పేర్లు, జారీ చేసే సర్క్యులర్లు, నోటీసులు, ఉత్తర ప్రత్యుత్తరాలు, సమాచారం, అన్నీ తెలుగులోనే ఉండాలని, అభివృద్ధి పనులకు ఏర్పాటు చేసే శిలాఫలకాలు కూడా జీవో 40 ప్రకారం, తప్పనిసరిగా తెలుగులోనే ఉండాలని ఆయన స్పష్టం చేశారు. దీనిని పాటించకపోతే జరిమానా, జైలుశిక్ష కూడా విధించే (మిగతా 2లో)

## రెండున్నర కోట్లు విలువైన అక్రమ సిగరెట్లు స్వాధీనం



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** అగ్గిపెట్ల రవాణా పేరుతో అక్రమంగా తరలిస్తున్న 2.40 కోట్ల రూపాయల విలువగల సిగరెట్లను కాకినాడ కస్టమ్స్ ప్రివెంటివ్ విభాగం మరియు కస్టమ్ హౌస్ అధికారులు కలిసి స్వాధీనం చేసుకుని సెంట్రల్ జీఎస్టీ వారికి అప్పగించారు. కాకినాడ కస్టమ్స్ అడిషనల్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి మరియు అసిస్టెంట్ కమిషనర్ ఎస్.రఘురామ్ వెల్లడించిన వివరాల ప్రకారం విశాఖపట్నం-విజయవాడ జాతీయ రహదారిలో అక్రమంగా విదేశీ సిగరెట్లు తరలిస్తున్నారనే సమాచారం వచ్చిందని తెలిపారు. వెంటనే తమ సిబ్బంది కలిసి కాకినాడ జిల్లా అన్నవరం దగ్గర బెండపూడి గ్రామం రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ శాఖ చెక్ పోస్టు వద్ద ఆంధ్రప్రదేశ్ రిజిస్ట్రేషన్ కలిగిన లారీని స్వాధీనం చేసుకొని అందులో సరుకు తనిఖీ చేయగా బీహార్ రాష్ట్రం పాట్నా నుంచి మన రాష్ట్రం నెల్లూరు జిల్లా వద్ద నాయుడు పేటకు అగ్గిపెట్ల పేరుతో అక్రమంగా సిగరెట్లు తరలిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. సుమారు 2.40 కోట్ల రూపాయలు విలువ చేసే 400 కార్టన్స్ అనగా (మిగతా 2లో)

## (మొదటి పేజీ తరువాయిలు)

### కేంద్రం కంటే ఏపీలో ఆర్థిక పరిస్థితి మెరుగు: సీఎం

కేంద్రం పన్నుల ఆదాయాన్ని పంచడం లేదని, ఏపీ దురదృష్టం ఏమిటంటే ప్రస్తుతం 32 శాతం మాత్రమే పన్నుల ఆదాయాన్ని కేంద్రం ఇచ్చిందని జగన్ తెలిపారు.

దుష్ప్రచారాల్ని ప్రజలు నమ్మొద్దు పాలనలో తెచ్చిన సంస్కరణలు, డీబీటీ లాంటి విధానాలు, సుపరిపాలన, ఆర్థిక క్రమశిక్షణ వల్ల పరిస్థితులు అదుపులో ఉన్నాయన్నాని జగన్ తెలిపారు. ఇంత చేస్తున్నా ఉద్దేశపూర్వకంగానే దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఇప్పటితో పోలిస్తే గతంలో కూడా ఇంతే బడ్జెట్ ఉన్నా చంద్రబాబు హయాంలో అమ్మ ఒడి పథకం లేదు, రైతు భరోసా లేదు, చేయూత ఎందుకు లేదో ఆయన చెప్పాలన్నారు. ఇలాంటి దుష్ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని జగన్ కోరారు. ఆర్థిక పరిస్థితిపై ఇవాళ చర్చ ముగియడంతో సోమవారం పరిశ్రమలపై చర్చ చేపడదామని జగన్ తెలిపారు.

### విద్యా సంస్థల్లో కామన్ డ్రెస్ కోడ్‌పై విచారణ జరపలేం

సంబంధించిన అంశమని, విద్యా హక్కు చట్టం కింద ఈ అంశంలో మార్గదర్శకాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. జస్టిస్ హేమంత్ గుప్తా, జస్టిస్ ఎస్.ధులియాలతో కూడిన సుప్రీం ధర్మాసనం ఈ పిటిషన్ ను పరిశీలించింది. అయితే ఇది కోర్టుకు రావాల్సిన అంశమే కాదని బెంచ్ వ్యాఖ్యానించింది. పిటిషనర్ల వాదనలను పరిగణనలోకి తీసుకోలేమంటూ విచారణకు నిరాకరించింది.

### అమరావతిలో అక్రమాలంటూ మూడేళ్లుగా ఆరోపిస్తున్నారే తప్ప ఒక్క ఆధారమైనా చూపించారా ?: జీవీఎల్

జగనే... విశాఖ రాజధాని అంటూ ప్రజలను మభ్యపెడుతున్నారని జీవీఎల్ మండిపడ్డారు.

అమరావతిలో మౌలిక వసతులు కల్పిస్తే కార్యాలయాలు ఏర్పాటు చేస్తామంటూ కేంద్ర సంస్థలు చెబుతున్నా జగన్ సర్కారు పట్టించుకోవడంలేదని అన్నారు.

### లిథియం సెల్ కర్మాగారాన్ని సందర్శించిన కేంద్రమంత్రి చంద్రశేఖర్

భారతదేశాన్ని ఎలక్ట్రానిక్ తయారీకి గ్లోబల్ హబ్‌గా మార్చాలన్న ప్రధాని మోదీ దార్శనికతను సాకారం చేసేందుకు ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లు దిశానిర్దేశం చేస్తున్నాయని శ్రీ చంద్రశేఖర్ ప్రశంసించారు.

"ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు వేగంగా ఎలక్ట్రానిక్స్ తయారీ, ఆవిష్కరణలు ఉద్యోగాల సృష్టికి కేంద్రాలుగా మారుతున్నాయి. వారు భవిష్యత్తులో పెద్ద పాత్ర పోషిస్తారు. మన యువతకు ఆసక్తిని కలిగించే ముఖ్యమైన రంగాలుగా ఉన్న డిజైన్ ఆవిష్కరణ, ఎలక్ట్రానిక్స్ తయారీ రెండింటిలోనూ భారతదేశ నాయకత్వాన్ని రూపొందిస్తారు, "అని ఆయన వివరించారు.చెన్నైకి చెందిన మునోత్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ రూ. 165 కోట్లతో ఈ అత్యాధునిక సౌకర్యాన్ని ఏర్పాటు చేసింది. ఈ సదుపాయం 2015లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ద్వారా టెంపుల్ టౌన్‌లో ఏర్పాటు చేసిన రెండు ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లలో ఒకటి.

ఇంకా ఈ కార్యక్రమంలో చైర్మన్ లాల్ చంద్ మునోత్, వైస్ చైర్మన్ జస్వంత్ మునోత్, మేనేజింగ్ డైరెక్టర్ వికాస్ మునోత్, డైరెక్టర్ శశి తదితరులు పాల్గొన్నారు.చంద్రశేఖర్ మొక్కలు ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం మంత్రి రెండు EMCలలో ఉన్న డిక్సన్ టెక్నాలజీస్ యునైటెడ్ టెలిలింక్స్ సౌకర్యాలను కూడా మంత్రి సందర్శించారు.

### తెలుగు భాష అమలుకు పెద్దమనుసుతో కృషి చేయండి

అధికారం సంస్థకు ఉందన్నారు. తెలుగు వాడకంలో తలెత్తే సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలోనే ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని డిఆర్‌ఓకు సూచించారు. భాష అమల్లో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు రాష్ట్రస్థాయిలో కూడా ప్రయత్నాలు చేస్తున్నామని లక్ష్మీప్రసాద్ వివరించారు.

జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి ముందుగా మాట్లాడుతూ, జిల్లాలో తెలుగు భాష అమలుకు కృషి చేస్తున్నామని చెప్పారు. తెలుగు సాహిత్యానికి, భాషకు విజయనగరం గడ్డపై చేసిన కృషిని వివరించారు. గురజాడ, ఆదిభట్ల, గిడుగు లాంటి మహనీయుల అడుగుజాడల్లో నడుస్తూ, వారి ఆశయాలను స్మరించుకుంటూ, భాషాభివృద్దికి, తెలుగుభాష అమలుకు తమవంతు కృషి చేస్తామని చెప్పారు. ఆంగ్ల పదం లేకుండా మాట్లాడటం కష్టమైన ఈ రోజుల్లో, క్రమక్రమంగా మార్పును తీసుకువస్తామని హామీ ఇచ్చారు. రోజువారీ పాలనా పరమైన కార్యక్రమాల్లో తెలుగును సంపూర్ణంగా అమలు చేసేందుకు అవసరమైన సహకారాన్ని అందించాలని కోరారు.

సమావేశంలో ముందుగా డాక్టర్ యార్లగడ్డ జీవిత విశేషాలు, ఆయన గొప్పతనం, సాహిత్య సేవను వివరిస్తూ, డాక్యుమెంటరీని ప్రదర్శించారు. యార్లగడ్డకు, ఆయన చిత్రపటాన్ని, బొబ్బిలి వీణను కలెక్టర్ జ్ఞాపికగా అందజేశారు. పలువురు అధికారులు మాట్లాడుతూ, తమతమ శాఖల్లో సంపూర్ణంగా తెలుగు భాషను అమలు చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్‌డిఓ సూర్యకళ, అధికార భాషాసంఘం పూర్వ సభ్యులు డాక్టర్ ఎ.గోపాలరావు, విశ్రాంత ఆచార్యులు డాక్టర్ వెలమల సిమ్మన్న, పరవస్తు సూరి, గురజాడ వారసులు వెంకటేశ్వర ప్రసాద్, ఇందిర, కాపుగంటి ప్రకాష్ తదితర ప్రముఖులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**తెలుగు భాష అమల్లో సమాచార శాఖకు అగ్రస్థానం**

జిల్లాలో తెలుగుభాష అమల్లో జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖకు అగ్రస్థానం దక్కింది. శాఖాపరంగా శతశాతం తెలుగు భాషను అమలు చేసినందుకు, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖాధికారి డి.రమేష్‌ను, అధికార భాషా సంఘం చైర్మన్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ఈ అంశంలో వెనుకబడి ఉన్న ఎపిఎస్‌ఐడిసి, ఎపి టిడ్కో, వాణిజ్య పన్నుల శాఖ తదితర పలు శాఖల్లో తెలుగు వాడకాన్ని పెంచాలని చైర్మన్ సూచించారు.

### రెండున్నర కోట్లు విలువైన అక్రమ సిగరెట్లు స్వాధీనం

48 లక్షల స్వదేశీ సిగరెట్లు, వాటికి సరిపడిన పన్నులు చెల్లించకుండా అక్రమంగా రవాణా చేస్తున్నారని తెలిపారు. అయితే ఈ కేసు తమ పరిధిలోకి రానందున విశాఖపట్నం సెంట్రల్ జీఎస్టీ కార్యాలయం పన్నుల విభాగానికి అప్ప చెప్పినట్లు తెలిపారు. ఈ దాడుల్లో కస్టమ్స్ సూపరింటెండెంట్లు మరియు ఇన్స్పెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీలకు మేలు జరగాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ మంత్రి రాష్ట్ర బీసీ సాధికార సమితి చైర్మన్ కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన బీసీ వర్క్ షాప్ లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ మళ్ళ సురేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ కొల్లు రవీంద్రను సురేంద్ర శాలువాతో సత్కరించారు . ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూవైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఒక్క ఛాన్స్ అని చెప్పి సాధ్యం కానీ హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చి ఇప్పుడు అన్ని వర్గాల వారిని మోసం చేస్తున్నారని రాష్ట్రంలో బీసీలందరూ ఈ వైయస్సార్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను, దౌర్జన్యాలను, ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలని కోరారు గతంలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బీసీల అందరికీ ఎన్నో సబ్సిడీతో కూడిన రుణాలు అందించారని, మళ్లీ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం శ్రేణులు తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలుగుదేశం కార్మిక నేత శంకర్రావు జన్మదిన వేడుకలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** తెలుగుదేశం పార్టీ 81 వ వార్డు ప్రధాన కార్యదర్శి మారిశెట్టి శంకర్రావు 67వ జన్మదిన వేడుకలు పార్లమెంట్ కార్యాల యంలో శుక్రవారం మాజీ శాసన మండ లి సభ్యులు అనకాపల్లి జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు బుద్ద నాగ జగ దీశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు. ముందుగా నాగ జగదీష్ శంకర్రావుకు పూలమాలవేసి శాలువా తో సత్కరించి నూకాంబిక అమ్మవారి చిత్ర పటాన్ని అందించి జన్మదిన శుభాకాం క్షలు తెలియజేశారు. అనంతరం తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు సమక్షంలో కేక్ కట్ చేసి శంకర్రావు కు తినిపించారు. అందరికీ స్వీట్లు కేకు పంపిణీ చేశారు ఈ సందర్భంగా నాగ జగదీష్ మాట్లాడుతూ మారిశెట్టి శంక ర్రావు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి కార్మిక నాయకుడిగా ఉంటూ తెలుగుదేశం పార్టీకి ఎనలేని సేవలు అందించారని వారి సేవలు గుర్తించి దేవస్థాన కమిటీ సభ్యులుగా వార్డు అధ్య క్షులుగా పనిచేసి పార్టీకి ప్రజా సంక్షేమానికి కృషి చేశారని ఇటువంటి జన్మదినం వేడుకలు మరిన్ని చేసుకొని ఉన్నతమైన పదవులు అలంకరించాలని నాగ జగదీష్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టి ఎన్ టి యు సి ఉపాధ్యక్షులు ధనాల విష్ణు చౌదరి రాష్ట్ర వాణిజ్య విభాగ అధికార ప్రతినిధి సూరే శతీష్ బీసీ సెల్ అధికార ప్రతినిధి విల్లూరి రమణబాబు పార్లమెంట్ టి ఎన్ టి యు సి ఉపాధ్యక్షులు దొడ్డి జగదీశ్వర రావు ఆర్గనైజింగ్ కార్యదర్శ డి వి వి అప్పారావు పార్లమెంట్ కార్యదర్శి మల్ల గణేష్ వాణిజ్య విభాగ అధికార ప్రతినిధి కర్రి మల్లేశ్వరరావు పట్టణ ప్రధాన కార్యదర్శి కొట్ని రామకృష్ణ పట్టణ శాఖ ఉపాధ్యక్షులు కుప్పిలి జగన్ పట్టణ కోశాధికారి పాలిమేర నాయుడు కాండ్రేగుల సత్యనారాయణ వేగి కృష్ణ కొణతాల బాల వానపల్లి కోటేశ్వరరావు బివిఎస్ అప్పారావు జామి రాజు ఎండకుర్తి అప్పలరాజు తిప్పన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ పీఐబీ కార్యాలయంలో సెల్లర్ సంవాద్ చర్చా కార్యక్రమం

**విజయవాడ, (పీఐబీ):** స్మార్ట్ పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ కోసం ఆన్‌లైన్ గవర్నమెంట్ ఇ-మార్కెట్‌ప్లేస్- జిఇఎం నిరంతరం కొత్త ఉత్పత్తి మరియు సేవా విభాగాలను జోడిస్తూ క్రమంగా అభివృద్ధి చెందుతున్న కొత్త ఫీచర్లతో ముందుకు వచ్చిందని జిఇఎం రక్షణశాఖ సలహాదారు, వీఎస్‌ఎం (రిటైర్డ్) కమోడోర్ బల్బీర్ ముంజాల్ తెలిపారు.

విజయవాడలోని పత్రికా సమాచార కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఈ రోజు జరిగిన 'సెల్లర్ సంవాద్'లో ఆయన ప్రసంగిస్తూ.. కేంద్ర, రాష్ట్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలు & ప్రభుత్వ రంగ సంస్థలతో సహా అన్ని ప్రభుత్వ కొనుగోలుదారులకు జిఇఎం ఒక వన్-స్టాప్ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ అని పేర్కొన్నారు.

ఉత్పత్తులు మరియు సేవల శ్రేణిని అందించే విక్రేతల భాగస్వామ్యాన్ని పెంచడానికి కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా 'సెల్లర్ సంవాద్'ని అనేక ప్రదేశాలలో నిర్వహిస్తోందని ఆయన చెప్పారు. గౌరవనీయ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దిశా నిర్దేశంలో భాగంగా 9 ఆగస్టు 2016న ప్రారంభించబడిన జిఇఎం పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్‌ను పునర్నిర్వచిం చడంలో ప్రసిద్ధి చెందింది. ప్రభుత్వ కొనుగోలుదారులు మరియు ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా సేకరణ చేసే విధానంలో సమూలమైన మార్పులను తీసుకురాగలిగిందని వెల్లడించారు. ఇది కాంటాక్ట్‌లెస్, పేపర్‌లెస్ మరియు క్యాష్‌లెస్ మరియు సమర్థత, పారదర్శకత మరియు చేరిక అనే మూడు స్తంభాలపై నిర్మితమైందని తెలిపారు.

జిఇఎం అన్ని కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, సహకార సంఘాలు మరియు ప్రభుత్వ రంగ సంస్థలను కొనుగోలుదారులుగా కలిగి ఉందని, జిఇఎం యొక్క విక్రయదారుల యొక్క వైవిధ్య స్వభావం 'సమష్టి కృషి' స్పష్టంగా ప్రతిబింబిస్తుందని ఆయన వివరించారు.

21-22 ఆర్థిక సంవత్సరంలో జిఇఎం సేకరణ విలువ 1 లక్ష కోట్ల రూపాయల మైలురాయిని ఒకే ఆర్థిక సంవత్సరంలో అధిగమించిందని కమోడోర్ ముంజాల్ స్పష్టంచేశారు. మొత్తంగా, జిఇఎం 2లక్షల 82వేల కోట్ల రూపాయల విలువైన 1 కోటి లావాదేవీలను సులభతరం చేసిందని.. దేశవ్యాప్తంగా కొనుగోలుదారులు మరియు అమ్మకందారులతో సహా వాటాదారుల మద్దతుతో మాత్రమే ఇది సాధ్యమైందని వెల్లడించారు. విక్రయదారుల్లో పెద్ద కంపెనీలు మరియు సంస్థల నుండి ప్రారంభించి, దేశవ్యాప్తంగా ఉన్న మహిళా పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక బృందాలు మరియు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఔత్సాహిక పారిశ్రామిక వర్గాలు ఉన్నాయని తెలిపారు.

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఔత్సాహిక పారిశ్రామిక వర్గాలు మరియు స్వయం సహాయక సంఘాల కోసం అంతరాయలు లేని ఆన్‌బోర్డింగ్ అనుభవాన్ని నిర్ధారించడానికి జిఇఎం పోర్టల్‌లో రూపొందించబడిన ప్రత్యేక నిబంధనలను వెల్లడించిన ముంజాల్, 61 వేల మంది నమోదిత ప్రభుత్వ కొనుగోలుదారులు మరియు 48.6 లక్షల మంది విక్రేతలు మరియు సర్వీస్ ప్రొవైడర్లు ఉన్నారని పేర్కొన్నారు. జిఇఎంలో దాదాపు 300 సర్వీస్ కేటగిరీలు మరియు 10000ం ఉత్పత్తుల కేటగిరీలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ కేటగిరీలు దాదాపు 44 లక్షల ఉత్పత్తి మరియు సేవల కేటలాగ్‌లను కలిగి ఉన్నాయి.

2016లో ప్రారంభమైనప్పటి నుండి, జిఇఎం అభివృద్ధి చెందుతోందని మరియు పోర్టల్‌కు కొత్త ఫీచర్లు మరియు కార్యాచరణలను జోడించడం కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్నాయని ఆయన చెప్పారు. గత 24 నెలల్లో సుమారు 2000 చిన్న మరియు 460+ ప్రధాన కార్యాచరణలు ప్రవేశపెట్టబడ్డాయని తెలిపారు.

వివిధ వ్యాపార సంస్థల నుండి విక్రేతలు మరియు మీడియా 'సెల్లర్ సంవాద్'కు హాజరయ్యారు, అక్కడ వారికి జిఇఎం పోర్టల్ యొక్క కార్యాచరణ మరియు దాని సులభతర నిర్వహణపై అవగాహన కల్పించారు. భారతదేశం యొక్క పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ ఎకోసిస్టమ్‌లో వాటాదారులుగా, పెద్ద సంఖ్యలో అమ్మకందారులను ప్రభావితం చేయడంతో పాటు ప్రేరణ పొందిన కొంతమంది విక్రేతలు తమ అనుభవాలను పంచుకున్నారు.

## కంచరపాలెం బస్ స్టాప్ లో బెంచీలు ఏర్పాటు చేసిన ఆర్కే మీడియా హౌస్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సామాజిక సేవలో నిత్యం ముందుండే ఆర్కే మీడియా హౌస్ ఆధ్వర్యంలో జాతీయ రహదారి కంచరపాలెం బస్ స్టాప్ వద్ద మూడు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేసి తన ఔన్నత్యాన్ని చాటుకుంది.

నిత్యం రద్దీ గా ఉండే కంచరపాలెం బస్సు స్టాప్ వద్ద అనేక మంది ప్రయాణికులు బస్సులు కోసం నిరీక్షణ చేస్తుంటారు...అక్కడ వృద్ధులు విద్యార్థులు, మహిళలు వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది... అక్కడ వారు పడుతున్న బాధలను గుర్తించిన ఆర్కే మీడియా హౌస్ అధినేత రవికాంత్ అక్కడ వాళ్ళు కూర్చునేందుకు వీలుగా ప్రయాణికుల సౌకర్యార్థం ఈ బెంచీలు ఏర్పాటు చేసినట్లు ఆర్కే మీడియా అధినేత బి రవికాంత్ తెలిపారు...ఎన్ ఏ డీ.. గోపాలపట్నం, గాజువాక వెళ్లే ప్రయాణికులు అత్యధికంగా ప్రయాణిస్తున్నారని వారందరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు...

మరింతమంది సేవాదృక్పదం చాటి మరిన్ని చోట్ల బెంచీలు ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రయాణికులు కోసం ఏర్పాటు చేసిన ఈ బెంచీలు పట్ల స్థానికంగా ఉన్న ప్రజలు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తు ఆర్కే మీడియా హౌస్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ లు జార్జ్, వాసుపల్లి కుమార్, చందు, ఆదిలక్ష్మి హాస్పిటల్ ఎం డీ బాడితబోయిన అప్పారావు, ఆర్థోపెడిక్ వైద్యనిపుణులు డాక్టర్ సంతోష్, వి వి ఆర్ ఇంజనీరింగ్ ఎం డీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

**పంచాంగం**

శనివారం 17-9-2022
శుభకృత్ నామ సంవత్సరము
దక్షిణాయణం వర్ష రుతువు
భాద్రపద మాసం

తిథి : బ. సప్తమి మ. 2.16
నక్షత్రం : రోహిణి మ. 12.22
వర్జ్యం : రా. 06.37 ల 08.24 వ


సమస్యలతో సతమతమవడం కంటే సాధకుల సహాయం కోరుట మేలు.
బ్రహ్మశ్రీ హనుమద్దాస్ స్వామీజీ గారు ప్రస్తుతం చెన్నై నగరంలో ఉన్నారు.
సెల్ : 9440537607

## ఆరిలోవ అంగన్వాడీలో పోషకాహార మహోత్సవం



**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):** సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు జరిగే పోషకాహార మహోత్సవాలలో భాగంగా 12వ వార్డు పెదగదిలి లో ఉన్న అంగన్వాడీ కేంద్రం లో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణీరామన్ హాజరయ్యారు . పిల్లల తల్లులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం కోసం వివరించి వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని గృహిణి మృతి



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** ఉరి వేసుకుని గృహిణీ మరణించిన ఘటన చింతపల్లి మండలంలోని ఆంధ్ర కాశ్మీర్ గా పేరుందిన లంబసింగి పంచాయతీ కొర్రుబయులు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. చింతపల్లి పోలీసులు అందించిన వివరాల ప్రకారం లంబసింగి కొర్రుబయలు గ్రామానికి చెందిన గిరి మహిళ పిట్ట సింహాచలం (50) గురువారం మధ్యాహ్నం ఇంటివద్ద దూలానికి సున్నితో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఈమె భర్త పదేళ్ల క్రితమే మరణించాడు. అప్పటినుంచి ఆమె ఇద్దరు మగ పిల్లలతో కలిసి జీవిస్తుంది. గురువారం ఆమె ఉరి వేసుకొని మరణించడంతో సమాచారం అందుకున్న చింతపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మహిళ బలవన్మరణ మృతి పై ఇన్చార్జి సీఐ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరణానికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కొత్తపల్లి గీత దంపతులకు హైకోర్టు బెయిల్
### సీబీఐ కోర్టు తీర్పు అమలు నిలిపివేత!



అరకు మాజీ ఎంపీ కొత్తపల్లి గీత, ఆమె భర్త పి.రామ కోటేశ్వరరావులకు జైలుశిక్ష విధిస్తూ సీబీఐ కోర్టు ఇచ్చిన తీర్పు అమలును తెలంగాణ హైకోర్టు నిలిపివేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే సమయంలో దంపతులు ఇద్దరికీ బెయిల్ మంజూరు చేసింది. రూ.25 వేల చొప్పున వ్యక్తిగత పూచీకత్తు సమర్పించి బెయిల్ పొందాలని ఆదేశించింది. ఈ కేసులో తర్వాతి విచారణను డిసెంబర్ 16వ తేదీన చేపడతామని ప్రకటించింది.

**ఆర్థిక అక్రమాల కేసులో..** తప్పుడు పత్రాలతో పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) నుంచి రుణం తీసుకుని మోసగించిన కేసులో కొత్తపల్లి గీత, ఆమె భర్త రామకోటేశ్వరరావులకు సీబీఐ కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష చొప్పున జరిమానా విధించిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో గీత, ఆమె భర్తకు సహకరించి అక్రమాలకు పాల్పడిన ఇద్దరు బ్యాంకు అధికారులకు కూడా కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది.

అయితే సీబీఐ కోర్టు తీర్పును సవాలు చేస్తూ కొత్తపల్లి గీత, ఆమె భర్త తెలంగాణ హైకోర్టులో అప్పీలు దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు.. శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. 2014లో వైఎస్సార్ సీపీ తరపున అరకు ఎంపీగా పోటీ చేసి గెలిచిన కొత్తపల్లి గీత.. తర్వాతి పరిణామాల్లో ఆ పార్టీని వీడారు. 2018లో సొంతంగా ఒక రాజకీయ పార్టీని నెలకొల్పినా.. తర్వాత బీజేపీలో విలీనం చేశారు.

విశాఖ సమాచారమ్

శనివారం 17-9-2022

# జ్ఞానం - వివేకం

విద్యాభ్యాసం, విస్తృత పుస్తక పఠనాల వల్ల పొందే జ్ఞానం ఒకటైతే, మనిషిలో ఉండే సహజమైన గ్రహింపు శక్తి, అవగాహన శక్తి వలన వచ్చే జ్ఞానం మరొకటి. దీనికే ఇంగితం లేదా ఇంగితజ్ఞానం అని పేరు. చదువుకున్న వారిలోనే ఇది ఉండనక్కరలేదు.

ఇది ప్రతి మనిషిలో ఉండే ఒక అంతర్లీనమైన ఒక జీవలక్షణం. జీవితంలో మనకు కలిగే అనేక అనుభవాలతో ఈ ఇంగితం మరింతగా పదునెక్కుతుంది. అందుకే ఇది ఎంతో విశిష్టమైంది. చదువుతో నిమిత్తంలేకుండా ప్రతి మనిషి జీవనానికి, జీవితానికి అత్యంత అవశ్యకమైనది. ఈ ఇంగితం మనలను అప్రమత్తులను చేసి వ్యవహార దక్షతను పొంచి జీవితం సజావుగా సాగేటట్టు చేస్తుంది.

విద్యాధికులలో ఉండే జ్ఞానమనే బంగరు పళ్లెరానికి ఇది ఒక గోడ చేర్పు లాంటిది. అనేక శాస్త్రాలను మధించి దాని జ్ఞానామృతాన్ని గ్రోలిన పండితులైనా, తమ జీవితాన్ని నూతన అవిష్కరణల కోసమై ధారపోసే శాస్త్రవేత్తలైనా తమ ఇంగితం ఉపయోగించవలసిన అవసరం ఉంటుంది. అలా కానివేళ, వారి జ్ఞానం వారికే కాక మానవాళికే ముప్పు తెస్తుంది. చరిత్ర పుటలు తిరగవేసినా, మన సమకాలీన చరిత్రను పరిశీలించినా ఈ విషయం తేటతెల్లమవుతుంది.

ఒక గురువు తనవద్ద శ్రద్ధతో విద్యాభ్యాసాన్ని పూర్తిచేసుకున్న నలుగురు శిష్యులకు చనిపోయిన వారిని బతికించగల అద్భుత శక్తినిచ్చాడు. అయితే, దానిని అత్యవసరమైనప్పుడు మాత్రమే ఉపయోగించ మని హెచ్చరించి పంపాడు. వారిలో ముగ్గురు మార్గమధ్యంలో ఒక పులి కళేబరాన్ని చూసి వారి అద్భుత శక్తిని ప్రయోగించాలని ఉవ్విళ్ళూరటం, నాలుగవవాడు వారి మూర్ఖత్వానికి వగచి, హితవు పలికి భంగపడి వీరికి దూరంగా వెళ్లి తన ప్రాణాలు దక్కించుకున్న కథ మనకు తెలుసు. ప్రాణాలు కోల్పోయిన ఆ నలుగురు జ్ఞానసంపన్నులే.

కాని వారిలో కొరవడిన ఇంగితం ప్రాణం నిలబెట్టుకున్న వాడిలో మెండుగా ఉంది. అలాగే పరస్త్రీని తాకకూడదన్న ధర్మాన్ని మనసులో స్థిరరచుకున్న ఒక శిష్యుడు ప్రవాహంలో కొట్టుకుపోతున్న ఒక స్త్రీని రక్షించడానికి ముందుకు రాలేదు. అక్కడ ఆపదలో ఉన్నది ఒక జీవి మాత్రమేనని భావించిన రెండోవాడు ఆమెను కాపాడటానికి కారణం ఇంగితమే. ఇంగితమంటే వివేకమే. ఒకరకమైన యుక్తాయుక్త విచక్షణ. సందర్భోచిత జ్ఞానం. మన చదువుల సారానికి, జీవితా నుభవాన్ని విచక్షణాశక్తిని కలిపి చూడగలగటమే ఇంగితం. మన ప్రవర్తనలో, వ్యవహార శైలిలో దానిని చూపగలిగేవారి జీవితం అపార్థాలు, తగాదాలు లేకుండా సాగుతుంది.

వందలాది పక్షులకు ఆశ్రయమిచ్చే ఓపెద్ద చెట్టుకింద కూర్చుని ధ్యానముద్రలో ఉన్నాడో పండితుడు. అపుడో పక్షి విడచిన విసర్జనం అతని తల మీద పడింది. విపరీతమైన కోపమొచ్చిన ఆయన దాని వంక తీక్షణంగా చూసాడు. అంతే! ఆ పక్షి కాలి బూడిదై పోయింది. ఆయనకు సంతోషమూ, గర్వమూ కలిగాయి. అన్ని పక్షులున్న చెట్టు కింద కూర్చుంటే ఆ అనుభవం ఎదురవ్వటం నీరు పల్లానికి వెళుతుందన్న నంత సహజం. ఇంత చిన్న విషయం ఆయనకు తట్టకపోవటానికి కారణం తన ఇంగితజ్ఞానాన్ని ఉపయోగించ లేకపోవటమే. ఇక్కడ ఇంగితమంటే వివేకమని అర్థం. చాల సహజమైన ఈ ఇంగితజ్ఞానాన్ని ఉపయోగించకపోతే పండితులు, జ్ఞానసంపన్నులు వారి శాస్త్ర సంబంధమైన జ్ఞానాన్ని, సాధన ద్వారా పొందిన జ్ఞానాన్ని ఎలా మట్టిపాలు చేసుకుంటారో చెపుతుందీ ఉదాహరణ.

నిస్సందేహంగా జ్ఞానమే అధిక్యమైనది, గొప్పది, విలువైనది. ఈ జ్ఞానాన్ని ప్రదర్శించేటప్పుడు ఒక నియంత్రణాశక్తిగా ఈ ఇంగితం పనిచేయాలి. రివాల్వరు ఉపయోగించగలగటం జ్ఞానం. అయితే, దానిని ఆ సందర్భంలో వాడవలసిన అవసరం ఉందా లేదా అనే సంగతిని మనకు బోధపరచే గొప్ప వజ్ఞ ఈ ఇంగితం.

ఇంగితమంటే తార్కికత, విచక్షణ, భావోద్వేగాలపై ఒక పట్టు. ఇంగితమంటే మన శక్తియుక్తుల్ని అవసరమైన చోట, తప్పనిసరైన క్షణాన మాత్రమే ఉపయోగించేటట్టు మనల్ని సమాయత్తం చేసే ఒక నిబద్ధత, ఒక అదుపు. అలా కానివేళలలో అది పిచుక మీద బ్రహ్మాస్త్రమే అవుతుంది.

ఒక పండితుడు గణితంలో అపారమైన జ్ఞానాన్ని సంపాదించాడు. విశేషమైన ప్రజ్ఞతో గణితానికి చెందిన ఏ లెక్కనైనా, సమస్యనైనా పరిష్కరించసాగాడు. తన గ్రామంలోనూ, చుట్టుపక్కల గ్రామాలలోనూ అంతటి మేధావి లేడని ఖ్యాతి పొందాడు. పేరు, డబ్బు వచ్చింది. ప్రజలు, ఇంత గణితశాస్త్ర పండితులు ఆయన ప్రజ్ఞాపాట వాలకు ఆశ్చర్యానుభూతికి లోనై ఆయనకు నీరాజ నాలిచ్చి సత్కారాలు, సన్మానాలు చేసారు. గణితంలో తనకన్నా ప్రజ్ఞావంతుడు లేడనే అహంకారం ప్రవేశించింది అతనిలో.

గర్వం తారస్థాయికి చేరుకొని 'నాతో పోటీపడగలవారెవరైనా ఉన్నారా మీ గ్రామంలో?' అని సవాలు విసరి, తలపడినవారిని ఓడించి, దూషించి అవమానించసాగాడు. ఒకసారి ఒక సాయంసంధ్య వేళలో ఒక గ్రామంలోకి ప్రవేశిస్తున్న సమయాన ఒక పశువుల కాపరి కలిసాడు. ఆ చదువురానివాడితోనూ తన గొప్పతనాన్ని గురించి అతిగా చెపుతూ వెళుతున్నాడు. ఒకచోట ఆ కాపరి తటాలున కిందకు వంగి ఒక గుప్పెడు ఇసుకను తీసుకుని 'అయ్యా, కొంచెం ఇదెంతో లెక్కించి చెప్పగలరా?' అని ఆ గణితశాస్త్ర పండితుణ్ణి అడిగాడు. ఆ ప్రశ్నకాపండితుడి నోటివెంట ఒక క్షణం మాట రాలేదు. ఆలోచన స్తంభించి పోయింది. చివరకు ఆ ఇసుకను లెక్కించలేమన్నాడు.

దానికా పశువులు కాపరి 'సామీ! దీనిని గుప్పెడని కదా అంటారు. ఐదు వేళ్ళు దగ్గరకు చేర్చి తీసుకుంటే చారెడు, రెండు అరచేతులతో తీసుకుంటే దోసెడు, బొటనవేలికి, చూపుడువేలికి మధ్య తీసుకుంటే చిటికెడని కదా అంటారు' అన్నాడు. అంతే ఆ పండితుడికి తన తప్పు తెలిసింది. మామూలు పద్ధతిలోనే ఆ ఇసుకను లెక్కించే యత్నం చేయటం వల్ల సమాధానం చెప్పలేకపోయానని. సహజసిద్ధమైన ఇంగితజ్ఞానాన్ని తను చూపలేకపోయానని అర్థం చేసుకుని తన అహంకారానికి సిగ్గుపడి అతడికి నమస్కరించి ఇంటిముఖం పట్టాడు.

# అన్న క్యాంటీన్ ప్రారంభించిన నియోజకవర్గ ఇన్చార్జ్ కోరాడ



భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్): భీమిలి నియోజకవర్గ పరిధి తగరపువలసలో నియోజకవర్గ ఇన్చార్జ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోరాడ రాజబాబు ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్లో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశాఖ పార్లమెంట్ అభ్యర్థి మతకుమిల్లి భరత్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది అలాగే ఈ కార్యక్రమం జీవీఎంసీ ఒకటో డివిజన్ అధ్యక్షులు తమ్మిన సూరిబాబు చిలక నర్సింగరావు దేవుళ్ళు నరవరామారావు తాడిపూడి అప్పలరాజు దిండి వెంకటేష్ సరగడ నరసింహారెడ్డి గిడుతూరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మూడో డివిజన్ అధ్యక్షులు గంట నూకరాజు విశాఖ పార్లమెంట్ రైతు ప్రధాన కార్యదర్శి భీమిలి రూరల్ మండలం అధ్యక్షులు డి ఏ ఎన్ రాజు రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కురిమిన లీలావతి, గోడి అరుణ, రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులు కసిరెడ్డి దామోదర్ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు గొల్లంగి ఆనందబాబు రాష్ట్ర చేనేత విభాగ కార్యదర్శి వానపల్లి సత్య, విశాఖ పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పిట్ట సురేష్, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు పతివాడ రాంబాబు, పద్మనాభం మండల పార్టీ ప్రెసిడెంట్ కోరాడ రమణ ,2,,4,8 వార్డు అధ్యక్షులు, బడిగంట నీలకంఠం ,పాసి నర్సింగ్ రావు, శెట్టిపల్లి గోపి, నియోజకవర్గ వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులు ఎరబాల అనిల్ ప్రసాద్, మాజీ జడ్పీటీసీ సరగడ అప్పారావు, రెండో వార్డ్ లీగల్ సెలె అధ్యక్షులు సోడిపల్లి జయశంకర్ సాయి, పిల్ల రాజేష్ మారోజు సంజీవ్ కుమార్, కనకల అప్పలనాయుడు, కాసరపు ఎల్లాజీ, ఎస్ గణేష్ రెడ్డి, చిలక నర్సింగరావు, భీమిలి మండల తెలుగు యువత అధ్యక్షులు కంటుభక్త సత్తిబాబు, భీమిలి నియోజకవర్గం రైతు ఉపాధ్యక్షులు కనకాల సూరిబాబు, నియోజకవర్గ వాణిజ్యభాగా జనరల్ సెక్రెటరీ గుండు చిన్న బాబు నియోజకవర్గ వాణిజ్యభాగ ఉపాధ్యక్షులు గొరే చంద్రమౌళి 8వ వార్డు జనరల్ సెక్రెటరీ బూడిపూడి దొరబాబు యువత అధ్యక్షులు బాబురావు గరికిన ఎల్లయ్య( కింగ్) కారి అప్పారావు గజ్జి రాజు వాసుపల్లి పోలమ్మ ఎర్ర బంగారు నాయుడు( బన్నీ) నియోజకవర్గ యువత జనరల్ సెక్రెటరీ దంతులూరి సిద్ధార్థ వర్మ లోకేష్ ఫౌండేషన్ అధ్యక్షులు సంతోష్ నియోజకవర్గ టిఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు కంటుబుక్త సుమంత్ నాయుడు ఒకటవ వార్డ్ యూత్ అధ్యక్షులు గొరే సదానంద నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షులు మరుపల్లి రాజేంద్రప్రసాద్ సెక్రెటరీ సారిక విజయకుమార్ తదితర నాయకులు పాల్గొనడం జరిగింది.

# రుషికొండ బీచ్ ప్రయివేటు యోచన విరమించాలి



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): రుషికొండ బీచ్ నిర్వహణ ప్రయివేటు సంస్థలకు అప్పచెప్పాలన్న ఎపి టూరిజం డవలప్‌మెంట్ కార్పొరేషన్ యోచనను వెంటనే విరమించుకోవాలని సిపిఎం విశాఖజిల్లా కమిటీ డిమాండ్ చేస్తుంది.

విశాఖ ప్రజలకు ప్రకృతి అందించిన వరం సముద్రం. సముద్రతీరంలో రుషికొండ బీచ్ సామాన్యులను, పర్యాటకులకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని ఇస్తున్నది. దీని నిర్వాహణ ప్రయివేటు సంస్థలకు కట్టబెట్టాలని ఎపిటిడిసి ప్రయత్నించడం క్షంత్యవ్యం కాదు. ఇది పేదలు, సామాన్యుల ఆనందాన్ని, ఆహ్లాదాన్ని ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించడాన్ని హరించడమే, అలాగే వ్యాపారం చేసుకోవడం అవుతుంది.

ఒకసారి రుషికొండ బీచ్ నిర్వహణ ప్రయివేటుపరమయ్యాక విశాఖ బీచ్‌లన్ని ప్రయివేటు మార్గం పట్టడం ఖాయం! దీనివల్ల సామన్య, పేదకుటుంబాలు బీచ్‌లో కాలుమోపడమే గగనమైపోతుంది. పర్యాటకులమీద రుసుముల భారాలు పెరుగుతాయి. ఇప్పటికే నగర నడిబొడ్డులో ఉన్నా సెంట్రల్ పార్క్ ఏ విధంగా ఉందో అర్ధమవుతుంది. వివిధ రాష్ట్రలలో ప్రయివేటు మెయింటినెన్స్‌కి ఇచ్చిన తరువాత అన్నిరకాల సేవలకు ధరలు వారిఇష్టం వచ్చినట్లు పెంచుకుంటారు.

ప్రభుత్వం ప్రజల నుండి వివిధరూపాల్లో పన్నులు వసూలు చేస్తోంది. వీటి నుండి బీచ్‌ల నిర్వహాణకు నిధులు కేటాయించడం, పర్యాటకరంగాన్ని అవివృద్ధిచేయడం ప్రభుత్వ బాధ్యత. ప్రభుత్వం బాధ్యతరహితంగా వ్యవరించి ప్రజలపై భారాలు వేయబూనుకొవడం దర్మార్గం.

రుషికొండ బీచ్ ప్రయివేటీకరణ యత్నాలు విడనాడి రాష్ట్ర ప్రభుత్వం నిధులుకేటాయించి, బీచ్ అబివృద్ధికి చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేస్తుంది.

# వెస్టన్ డిజిటల్లో 'షేర్ యువర్ మెమోరీస్' ఆరు నెలల పండగ పోటీ ప్రారంభం




విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఈ పండగ సీజన్లో వినియోగదారులకు సంతోషం కలిగించేందుకు 'షేర్ యువర్ మెమోరీస్' అనే పోటీని నిర్వహిస్తున్నట్లు వెస్టన్ డిజిటల్ భారతదేశం, మధ్యప్రాచ్యం, టీఐఏ సీనియర్ డైరెక్టర్ (మార్కెటింగ్) జగన్నాథన్ చెల్లయ్య తెలిపారు. ఈ పోటీలో పాల్గొనేందుకు వినియోగదారులు శాన్ డిస్క్ ఉత్పత్తులు 128 జీబీ అంతకంటే ఎక్కువ లేదా ఏదైనా డబ్ల్యుడీ ఉత్పత్తులతో సహా ఎంపిక చేసిన పాశ్చాత్య డిజిటల్ ఆఫర్‌లను కొనుగోలు చేయడం, 2టీబీ అంతకంటే ఎక్కువ కొనుగోలు చేయడం ద్వారా ఈ ఉత్తేజకరమైన పోటీలో పాల్గొనడానికి అర్హత పొందుతారన్నారు. ప్రతి వారం ఇద్దరు విజేతలు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీ అర్హత పొందిన ఉత్పత్తులను కొనుగోలు చేసిన తర్వాత, క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, ఉత్పత్తి ప్యాకేజీ లేదా https://www.shareyourmemory.in/ కు లాగిన్ చేయడం, అవసరమైన వివరాలను పూరించాలని తెలిపారు. అనంతరం 30 నుంచి 200 పదాలలో మీ సంతోషకరమైన జ్ఞాపకాన్ని పంచుకోవడం ద్వారా మీ ఎంట్రీని సమర్పించాలన్నారు. ఒక స్వతంత్ర జ్యూరీ ప్రతి వారం ఇద్దరు విజేతలను ఎంపిక చేస్తోందన్నారు. వీరు రూ.లక్ష విలువైన వోచర్లను గెలుచుకుంటారన్నారు. ప్రతి క్వార్టర్ ఒక విజేత 150గ్రాముల బంగారం గెలుచుకోవడానికి ఎంపిక చేయబడతారన్నారు. ఒక పండుగ ఎక్కువ కాలం ఉండకపోవచ్చు, కానీ స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి సృష్టించే జ్ఞాపకాలు పండుగల సమయంలో శాశ్వతంగా ఉంటాయన్నారు. ఈ పండుగ సీజన్‌లో అమ్మకాలను పెంచుకోవడానికి మా ఛానెల్ భాగస్వాములు. శాన్ డిస్క్, డబ్ల్యుడీ నుంచి అర్హత ఉన్న అన్ని ఉత్పత్తులపై స్క్రాచ్ కోడ్ వివరాలతో కూడిన పెద్ద స్టిక్కర్ ఉంటుందన్నారు. ఈ పండుగ సీజన్ లో వినియోగదారులు వెస్టన్ డిజిటల్ లో అద్భుతమైన బహుమతులు గెలుచుకునే అవకాశం ఉందని తెలిపారు.

# అంకుపాలెంలో ఎం వి ఆర్ కు జన నీరాజనాలు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): చోడవరం నియోజక వర్గం అంకుపాలెం పంచాయితీ గోవిందమ్మ కాలనీలో వినాయక నిమజ్జనం మహోత్సవ కార్యక్రమానికి ప్రముఖ వ్యాపారవేత్త ఎం బి ఆర్ గార్మెంట్స్ అండ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయనతోపాటు వెంకటేశ్వరరావు కుమారుడు సతీష్, ప్రముఖ వాణిజ్యవేత్త బిజేష్ రెడ్డి గౌరవ అతిథులుగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసినచేసిన అన్నసమారాధన ను వారు ప్రారంభించారు. కార్యక్రమానికి వచ్చిన వెంకటేశ్వరరావుకు స్థానిక ప్రజానీకం బాణసంచా, డప్పులతో సాదర స్వాగతం పాలకడం తో పాటు మహిళలు అడుగడుగునా మంగళ హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు అనంతరం వినాయకుడ్ని , రామాలయం సీతారాముల ను దర్శించుకుని, కొత్తగా నిర్మిస్తున్న దుర్గాదేవి ఆలయానికి తమవంతు సహాయం తప్పక చేస్తామని ఎంవీఆర్ తనయుడు సతీష్ బాబు తెలియజేయడం తో స్థానిక ప్రజానీకం హర్షధ్వనాల మధ్య చప్పట్లతో ప్రాంగణం మారుమోగింది.ఈ సందర్భంగా స్థానిక పంచాయితీ ప్రెసిడెంట్ చందూ రాంబాబు మాట్లాడుతూ చోడవరం,అనకాపల్లి నియోజకవర్గాలలో ఎం. వీ.ఆర్ పేరు మారుమ్రోగుతుందని , ఇంత స్థాయిలోయువత తరలిరావడం చూస్తేనే ఎంవీఆర్ చేసే సహాయ కార్యక్రమాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం అవుతుందని తెలిపారు.

స్వతహాగా పారిశ్రామిక వేత్తగా అందరికీ సుపరిచితులైన ఎంవీ ఆర్ సేవా కార్యక్రమాల్లో ఎంతో చురుకుగా ఉంటారని ,అడిగినవారికి లేదనకుండా దానాలివ్వడమేకాక ఎంతో మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించినట్లు ఎంవీఆర్ యువసేన సభ్యులు తెలిపారు.



# తక్షణమే వేతన సవరణ చేయాలి



గాజువాక, (విశాఖ సమాచారమ్): ఉద్యోగులకు తక్షణమే వేతన సవరణ చేయాలని, లేని పక్షంలో ఆందోళన ఉద్రితం చేస్తామని ఇంటక్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. కార్మిక సమస్యలు పరిష్కారం కోరుతూ శుక్రవారం ప్లాంట్ బీసీ గేటు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు లో పూర్తి స్థాయి ఉత్పత్తి చేయాలని, ఉక్కు అస్పత్రిలో సౌకర్యాలు మెరుగుపర్చాలని, ఉత్పత్తికి తగ్గ ఇన్సెంటీవ్ ఇవ్వాలని, దసరా బోనస్ అరవై వేలు ఇవ్వాలని, కాం ట్రాక్టు కార్మికులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మిక సమస్యలు పరిష్కారం కోరకు ఇంటక్ రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, నాయకులు కారు రమణ, గొందేశి ప్రభా కర్రెడ్డి, మొల్లి ఈశ్వరరావు, ఎస్ఏ. నాయుడు, కొవిరి అవతారం, పీవీ నగేష్, కామరాజు, జీవీ.సుబ్బయ్య, శ్రీరామ్మూర్తి, ఎంఎస్ఎన్.ప్రసాద్, పీవీ.రమణమూర్తి, పైడికొండ, సుదర్శనం, డి.యల్లాజీరావు, ఎస్ఎస్.రెడ్డి, గంగవరం గోపి తదితరులు పాల్గొన్నారు.

# మలేరియా విభాగం ఆధ్వర్యంలో డెంగ్యూపై అవగాహన సదస్సు



గాజువాక, (విశాఖ సమాచారమ్): 58 వార్డ్ రాంనగర్ లో జీవీఎంసీ మలేరియా ఇన్స్పెక్టర్ మరియు వార్డు మలేరియా విభాగం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన డెంగ్యూ అవగాహణ సదస్సులో ముఖ్య అతిధులుగా వార్డ్ కార్పొరేటర్ గులిగిందాల లావణ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నదని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలద్వారా ప్రజలు సంపూర్ణ ఆరోగ్యం అందించు టకు కృషి చేస్తున్నారని తెలిపారు.ప్రజలు పరిశుభ్రత పాటించలని కోరారు .ఇంటి ఆవరణలో పాత టైర్లు, వాడి పడేసిన కొబ్బరిబొండాలు, నీటి డ్రమ్ములను శుభ్రం గా ఉంచాలని డెంగీ రాకుండా జాగర్త తీసుకోవాలని కోరారు . ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు గులిగిందాల కృష్ణ, కన్నబాబు సానిటరీ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, అడ్మిన్ లోవరాజు సచివాలయ వాలెంటీర్లు, నాయకులు, అధిక సంఖ్యలో స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న స్వచ్ఛ సంకల్ప కార్యక్రమం



పరవాడ, (విశాఖ సమాచారమ్): మేజర్ పంచాయతీ పరవాడ గ్రామ సచివాలయం లో జగనన్న స్వచ్ఛ సంకల్ప సర్పంచ్ కార్యక్రమంలో సిరపురపు అప్పలనాయుడు మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ లో భాగంగా గురువారం నుండి పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల లో 16 రోజులపాటు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతుందని వెల్లడించారు.గ్రామాల్లో సైతం పట్టణాల తరహాలో ఇంటింటా చెత్త సేకరణతో పాటు పూర్తి పరిశు భ్రంగా గ్రామాలను తీర్చిదిద్దిడమే లక్ష్యంగా క్లీన్ అంధ్రప్రదేశ్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాలు నిర్వహిస్తోందని అన్నారు.ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాల ద్వారా వ్యక్తిగత ఆరోగ్యం మరియు సామాన్య ప్రయోజనాల గురించి వివరించారు.16 రోజుల పాటు జరిగే రోజు వారి కార్యక్రమాల గురించి వివరించారు.

ఈ కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గ అగ్రిగోల్డ్ బాధితుల బాసట కమిటీ కన్వీనర్ పైల హరీష్ , పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు , విఆర్ఓ వెంకటేశ్వరరావు , వార్డు మెంబర్లు పోతల అప్పలనాయుడు , సిరపురపు రాజేష్ , చుక్క వెంకటలక్ష్మి , గెడ్డం లక్ష్మి రామారావు , వాలంటీర్లు , సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# లక్ష్మీ షా ను సత్కరించిన మందపాటి దంపతులు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): మహా విశాఖ నగరపాలక సంస్థ ప్రధాన కమిషనర్ గా ఉత్తమ సేవలందించి, బదిలీపై అమరావతి వెళ్తున్న లక్ష్మి షాను 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి పట్టణ శాఖ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు దంపతులు సత్కరించారు. గురువారం విశాఖలోని ఆయన నివాసం లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంలో జీవీఎంసీతో పాటు అనకాపల్లి జోన్ లోని సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి చేయడానికి ఆయన చేసిన కృషికి అభినందనలు తెలియజేశారు.

## లంగ్ క్యాన్సర్ ఉంటే ఈ లక్షణాలు కనిపిస్తాయి



మనదేశంలో ఎక్కువగా కనిపించే అయిదు క్యాన్సర్లలో ఊపిరితిత్తుల క్యాన్సర్ ఒకటి. ప్రపంచ వ్యాప్తంగా క్యాన్సర్ కారణంగా సంభవిస్తున్న మరణాల్లో 25 శాతం ఊపిరితిత్తుల క్యాన్సర్ వల్లే జరుగుతున్నాయి. అందుకే ఇది అత్యంత ప్రమాదకర క్యాన్సర్ అని నిపుణులు చెబుతున్నారు. ఈ క్యాన్సర్ రావడానికి కారణాల్ని కచ్చితంగా చెప్పలేం. స్మోకింగ్ దీనికి ప్రధాన కారణం అని నిపుణుల అంచనా. స్మోకింగ్ అలవాటు లేనంత మాత్రాన ఈ క్యాన్సర్ రాదని రిలాక్స్ అవ్వడానికి లేదు. పొగతాగని వారికీ ఈ క్యాన్సర్ వస్తుంది. ఇమ్యూనిటీ మన మీద దాడిచేయడం వల్ల వచ్చే జబ్బులు, ఎక్స్‌రేలు, వాతావరణంలో ఉండే రేడియేషన్, అరుదుగా జన్యువులు కూడా ఈ క్యాన్సర్‌కు కారణం కావొచ్చు. ఊపిరితిత్తుల క్యాన్సర్ గురించి అవగాహన కల్పించడానికి గురుగ్రామ్‌లోని నేషనల్ రిఫరెన్స్ లాబొరేటరీ హెడ్ శిల్పీ అహ్లావత్, దీని గురించి కొన్ని విషయాలు మనతో షేర్ చేశారు.

**ఊపిరితిత్తుల క్యాన్సర్ అంటే...** అక్కడి కణాలు నియంత్రణ లేకుండా అపరిమితంగా పెరిగిపోవడమే. సాధారణంగా శ్వాసనాళాల కణాలలో, బ్రోన్కియోల్స్/అల్వియోలీ వంటి ఊపిరితిత్తుల భాగాలలో క్యాన్సర్ స్టార్ట్ అవుతుంది. క్యాన్సర్ మొదట ఊపిరితిత్తుల్లోని ఎపిథీలియల్ కణాల్లో కనిపిస్తే దాన్ని 'ప్రైమరీ లంగ్ క్యాన్సర్' అంటారు. క్యాన్సర్ శరీరంలోని ఇతర భాగాల నుంచి కూడా ఊపిరితిత్తులకు వ్యాపిస్తుంది దీన్ని సెకండరీ లంగ్ క్యాన్సర్ అంటారు. ఉదాహరణకు చాలామందిలో రొమ్ముక్యాన్సర్ మెటస్టాటిస్ వల్ల ఊపిరితిత్తులకూ సోకుతుంది.

ప్రైమరీ లంగ్ క్యాన్సర్ రెండు రకాలు ఉంటుంది. స్మాల్‌సెల్ లంగ్‌క్యాన్సర్, నాన్-స్మాల్‌సెల్ లంగ్ క్యాన్సర్

**స్మాల్‌సెల్ లంగ్‌క్యాన్సర్:** ఇది స్మోకింగ్ చేసే వారిలో ఎక్కువగా కనిపిస్తుంది. మొత్తం లంగ్ క్యాన్సర్లలో 14 శాతం ఇవే ఉంటాయి. ఈ క్యాన్సర్ వేగంగా పాకుతుంది. ఇది ప్రధానంగా స్మాల్ సెల్ కార్సినోమా , కంబైన్డ్ స్మాల్ సెల్ కార్సినోమా కావచ్చు. ఇవి వేగంతా వ్యాప్తిచెందడం వల్ల లింఫ్‌నోడ్స్, ఎముకలు, మెదడు, అడ్రినల్ గ్రంథి, కాలేయంలోకీ పాకే అవకాశాలున్నాయి.

**నాన్-స్మాల్‌సెల్ లంగ్ క్యాన్సర్:** లంగ్ కేన్సర్‌తో బాధపడేవారిలో 80 నుంచి 85 శాతం మంది నాన్-స్మాల్‌సెల్ లంగ్ క్యాన్సర్ కేసులే. ఇది ప్రధానంగా అడెనోకార్సినోమా, పొలుసుల కణ క్యాన్సర్, పెద్ద సెల్ కార్సినోమా వల్ల కావచ్చు.

**ఈ లక్షణాలు కనిపిస్తాయి..** తీవ్రమైన దగ్గు, ఛాతీలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, దగ్గే సమయంలో రక్తం పడటం, అలసటగా అనిపించడం, కారణం లేకుండా బరువు తగ్గడం, ఎముకల్లో నొప్పి, వేలిగోళ్లు బాగా వెడల్పుకావడం, జ్వరం, పిల్లికూతలు, ఆహారం రుచించకపోవడం. అయితే, ఈ లక్షణాలు ఇతర వ్యాధులలో కూడా కనిపిస్తాయి. ఈ లక్షణాలలో ఏవైనా కనిపించినట్లయితే ఖచ్చితంగా డాక్టర్‌ను కలవండి.

**స్మోకింగ్ మానేయండి..** లంగ్ క్యాన్సర్ పేషెంట్స్‌లో స్మోకింగ్ అలవాటు ఉన్నవారే ఎక్కువ. ఇతర కారణాల వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చిన వారితో పోలిస్తే, స్మోకింగ్ వల్ల లంగ్ క్యాన్సర్ వచ్చే వ్యక్తులు.. మరణించే అవకాశం 15 నుంచి 30 శాతం ఎక్కువ. సిగరెట్ తాగేవారు కూడా రకరకాలు ఉంటారు, కొంతమంది చైన్ స్మోకర్స్, మరికొందరు రోజుకు ఒకటి, రెండు సిగరెట్లు తాగుతారు. ఈ తీవ్రత బట్టి, క్యాన్సర్ తీవ్రత ఆధారపడి ఉంటుంది. లంగ్ క్యాన్సర్ ఉందని నిర్ధరణ అయిన తర్వాత, స్మోకింగ్ పూర్తిగా మానేసిన వ్యక్తులు కోలుకునే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అయినప్పటికీ, స్మోకింగ్ అలవాటు లేనివారికంటే.. వీరికి ప్రాణాపాయం ఎక్కువగా ఉంటుంది.

## వీటిని తింటే కిడ్నీలకు చాలా మంచిది



సరైన నిద్ర..నిద్ర లేకపోవడం వల్ల అది మీ కిడ్నీల పనితీరుని నెమ్మదిగా మార్చి కిడ్నీలు పాడయ్యేలా చేస్తుంది. కాబట్టి హాయిగా నిద్రపోవాలని సూచిస్తున్నారు. నిద్రలేకపోవడం వల్ల కిడ్నీలపై మాత్రమే కాదు. అనేక భాగాలకు కూడా ఇబ్బంది ఎదురవుతుంది. కాబట్టి హాయిగా నిద్రపోవాలి. రోజుకి 6 నుంచి 8 గంటలు నిద్ర మంచిదని చెబుతున్నారు నిపుణులు. ఒకవేళ మీరు నిద్ర సమస్యలు ఎదుర్కొంటుంటే వాటికి సంబంధించిన సమస్యల్ని దూరం చేసేందుకు నిపుణుల సలహా తీసుకోవచ్చు.

**ఉప్పు తగ్గించడం..** అన్ని వేసి చూడండి.. నన్ను వేసి చూడండి అంటుందట ఉప్పు. అవును ఉప్పు తక్కువైనా, ఎక్కువైనా ఆ పదార్థం రుచే మారుతుంది. ఇది కేవలం రుచికే కాదండి.. ఆరోగ్యం విషయంలోనూ అవసరమే. ఎందుకంటే ఉప్పు కొన్ని సందర్భాలలో మంచిదే కానీ, ఉప్పు తీసుకోవడం వల్ల బాడీలో యూరీనరీ ప్రోటీన్ లెవల్స్ పెరుగుతాయి. ఇది ప్రమాదకరం, సీజన్‌ల వారీగా మూలికలు తీసుకోండి. అదే విధంగా మీ భోజనంలో ఉప్పు ఎక్కువగా వాడకండి.

**విటమిన్స్‌తో కూడిన ఫుడ్..** మంచి ఆరోగ్యం మనం తీసుకునే మంచి ఆహారంపై ఆధారపడి ఉంటుంది. మనం ఏం తింటామో దాని మీదే మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. కాబట్టి ఆహారం విషయంలో ఎప్పుడు కూడా రాజీ పడొద్దు. సరైన విధంగా, మంచి తాజా ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యమని గుర్తుపెట్టుకోండి. మీ డైట్‌లో విటమిన్స్ లేకపోవడం కూడా కిడ్నీల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. కాబట్టి మీరు తీసుకునే ఫుడ్స్ మంచి విటమిన్స్‌తో నిండి ఉండాలని గుర్తుపెట్టుకోండి.

**పెయిన్ కిల్లర్స్..** బాడీలో ఏదైనా నొప్పిగా అనిపిస్తే మనం నొప్పి తగ్గించే పెయిన్ కిల్లర్స్ వేసుకుంటాం. కానీ, గుర్తుపెట్టుకోండి. వీటిని తీసుకోవడం వల్ల కిడ్నీలపై ఎఫెక్ట్ పడి సమస్యగా మారుతుందని గుర్తుపెట్టుకోండి. అందుకే ఎక్కువగా పెయిన్ కిల్లర్స్ వేసుకోకూడదు. ఇందుకోసం మీ డాక్టర్స్ ఏం సజెస్ట్ చేస్తారో వాటిని పాటించండి. వారు సమస్యకి కచ్చితమైన మార్గాన్ని సూచిస్తారు.

**వర్కౌట్..** వర్కౌట్ శరీరానికి ఎప్పుడు మంచిదే. ముఖ్యంగా కిడ్నీ ఫంక్షన్‌కి కూడా కాబట్టి కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే రెగ్యులర్‌గా వర్కౌట్ చేయాల్సిందే. దీని వల్ల శరీరం, మనసు రెండు కూడా ఉల్లాసంగా ఉంటాయి. వారంలో కనీసం 4 నుంచి 5 సార్లు వర్కౌట్ చేయడం మంచిది. దీని వల్ల వచ్చే లాభాలను మీరు అనుభవిస్తారు. జిమ్‌కి వెళ్ళడం కుదరకపోతే యోగా, అది కూడా కష్టం అనుకుంటే కనీసం నడక లాంటివి ప్రాక్టీస్ చేయండి.

**ఆల్కహాల్..** ఆల్కహాల్ ఆరోగ్యానికి అంత మంచిది కాదు. దీనిని ఎక్కువగా తీసుకోవడం వల్ల కిడ్నీలు వాటి పనితీరును తగ్గించిన వారవుతాం. కాబట్టి ఆల్కహాల్ అలవాటుకి దూరంగా ఉండండి. దీని వల్ల ఆరోగ్యానికి చాలా మంచిది. మితిమీరిన ఆల్కహాల్ మీ ఆరోగ్యాన్ని చాలా విధాలుగా హాని చేస్తుంది. దీని వల్ల నిద్ర వస్తుందని భ్రమ పడతారు చాలా మంది. అది తాత్కాలికమే. అందుకే దీనికి దూరంగా ఉండడమే మంచిది.

**పొగ త్రాగడం..** పొగ త్రాగడం వల్ల కిడ్నీలే కాదండి.. గుండె, ఊపిరితిత్తులకి కూడా సమస్యే. కాబట్టి ఈ అలవాటుకి దూరంగా ఉంచడం మంచిది. ఇది మీతో పాటు మీ పక్క వారికి కూడా హాని చేస్తుందని గుర్తుపెట్టుకోండి. అందుకే ఈ అలవాటుని కూడా మానేయడం చాలా మంచిది. దీని వల్ల మీతో పాటు మీ చుట్టు పక్కల వారికి కూడా మంచి జరుగుతుందని గుర్తుపెట్టుకోండి. దీని మరిచిపోయేందుకు మీరు నిపుణుల సలహా తీసుకోవచ్చు.

**ఏం తినాలంటే..** కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే కొన్ని మంచి ఆహార పదార్థాలు తినాలని ముందుగా చెప్పుకున్నాం. మరి ఏం తినాలి. బ్లూ బెర్రీస్, కాలీఫ్లవర్, రెడ్ కలర్ గ్రేప్స్, ఎగ్ వైట్స్, వెల్లుల్లి, బక్‌వీట్, ఆలీవ్ ఆయిల్, బెల్ పెప్పర్స్ ఇవన్నీ కూడా కిడ్నీలను ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి.

## ఈ ట్యాబ్లెట్స్ వాడితే జుట్టు రాలడం తగ్గుతుందట



ఈ మధ్య కాలంలో ఎక్కువ మంది పురుషులు, స్త్రీలు కూడా జుట్టు రాలిపోవడం సమస్యతో బాధ పడుతున్నారు. నిజానికి జుట్టు రాలిపోవడం మొదలైందంటే ఎక్కువ మోతాదులో జుట్టు ఊడిపోతూ ఉంటుంది. దీని కారణంగా మనం ఎంతో బాధపడిపోతూ ఉంటాము. మానసికంగా కూడా కుంగిపోయిన వాళ్ళు చాలా మంది ఉన్నారు. అయితే జుట్టు రాలిపోకుండా ఉండాలంటే ఈ ఇంటి చిట్కాలను అనుసరించొచ్చు.

ఆహారంలో మార్పులు చేసుకుని జీవనశైలిలో మార్పులు చేసుకుని జుట్టు రాలిపోకుండా ఉండొచ్చు. అయితే మరి అసలు ఎందుకు జుట్టు రాలిపోతూ ఉంటుంది..? దీనికి గల కారణాలు ఏమిటి అనేది ముందు తెలుసుకుందాం. ఒకటి కాదు రెండు కాదు చాలా కారణాల వల్ల జుట్టు రాలిపోతుంది అని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అయితే మరి అసలు జుట్టు ఎందుకు రాలిపోతుంది .

**జుట్టు రాలిపోవడం వెనక ఉన్న కారణాలు :**

**ఒత్తిడి** : ఒత్తిడి గురించి కొత్తగా చెప్పేదేమీ లేదు ఇంటి పనులు ఆఫీసు పనులు ఇలా వీటితోనే సమయమంతా అయిపోతోంది. పైగా పనులని సరైన సమయానికి పూర్తి చేయాలని ఎంతో ఒత్తిడితో ఉంటారు. ఒత్తిడి కారణంగా పోషక పదార్థాలు బ్యాలెన్స్‌గా ఉండవు ఈ ముఖ్య కారణం వల్ల జుట్టు రాలిపోతుంది. కాబట్టి ఒత్తిడికి వీలైనంత వరకు దూరంగా ఉంటే మంచిది.

ఒత్తిడిని అధిగమించడానికి తగిన పద్ధతుల్ని అనుసరించండి.

ఒత్తిడిని దూరం చేయడానికి యోగా, మెడిటేషన్ బాగా సహాయపడుతాయి.

మ్యూజిక్ వినడం వల్ల కూడా ఒత్తిడి దూరమవుతుంది.

చక్కగా పాజిటివ్ ఆలోచనలు కలిగి నెగిటివ్ ఆలోచనలను పక్కన పెట్టేస్తే కూడా మనసు ప్రశాంతంగా హాయిగా వుంటుంది.

ఇలా ఈ మార్పులు చేసుకుంటే ఒత్తిడికి దూరంగా ఉండొచ్చు. అందమైన కురులను కూడా పొందొచ్చు.

**తీసుకునే ఆహారం** : మనం తీసుకునే ఆహారం ఎంతో ముఖ్యమైనది. మనం తీసుకునే ఆహారాన్ని బట్టి మన ఆరోగ్యం ఆధారపడి ఉంది. అలానే మంచి ఆహారం తీసుకుంటే కురులు కూడా బాగుంటాయి. ఆరోగ్యకరమైన కురులను పొందాలంటే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. బయోటిన్, జింక్, విటమిన్ డి ఆహారంలో లేకపోతే జుట్టు రాలిపోతూ ఉంటుంది. కాబట్టి మంచి ఆహారాన్ని తీసుకోండి. సమతుల్యమైన ఆహారం తీసుకోండి. ప్రతి రోజు అన్ని రకాల పోషక పదార్థాలు డైట్‌లో ఉండేలా చూసుకోండి.

**బరువు తగ్గడం** : ఎవరైనా బరువు తగ్గారంటే జుట్టు రాలిపోతూ ఉంటుంది. దీనికి గల కారణం ఏమిటంటే కొన్ని ముఖ్యమైన పోషక పదార్థాలు ఒంట్లో తగ్గిపోయి కొన్ని పోషక పదార్థాల లోపం కలుగుతుంది. ఈ కారణంగా కూడా జుట్టు రాలిపోతూ ఉంటుంది. కనుక మీరు బరువు తగ్గిపోతూ ఉంటే జాగ్రత్త వహించండి.

**వయసు** : జుట్టు రాలిపోవడానికి వయసు కూడా ఒక కారణం. వయసు పైబడే కొద్ది జుట్టు రాలుతుంది. ఆడవారిలోనూ మగవారిలోనూ కూడా ఈ సమస్య కలుగుతుంది.

**అసలు ఎందుకు జుట్టు రాలుతుంది.....?** అసలు ఎందుకు జుట్టు రాలుతుంది, ఏమవుతుంది అనేది చూస్తే.. పైన తెలిపిన ఏ కారణాల వల్లనైనా సరే జుట్టు ఊడిపోవచ్చు. పైన ఉన్న కారణాల వల్ల ఫాలికల్స్‌కి సమస్య వచ్చి హెయిర్ ఫైబర్ బలహీన పడిపోతుంది. ఇలా హెయిర్ ఫైబర్‌కి సమస్య కలిగినప్పుడు జుట్టు ఊడిపోతూ ఉంటుంది. ఫాలికల్ చనిపోతే దానికి మరో పరిష్కారం లేదు. హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ తప్ప. ఒకవేళ కనుక మీ జుట్టు రాలిపోతోందని మీరు సరిగ్గా గమనించినట్లైతే సరైన పోషక పదార్థాలు తీసుకోవడం సరైన హెయిర్ కేర్ తీసుకోవడం వలన ఈ సమస్య నుండి బయటపడవచ్చు.

**జుట్టు రాలిపోకుండా ఉండాలంటే ఈ పద్ధతులను అనుసరించండి** : మొదట జుట్టు రాలుతోందని మీరు గమనించినట్లయితే ఒత్తిడి లేకుండా ఉండండి. ఒత్తిడి లేకుండా ఉంటే జుట్టు మరియు చర్మ సమస్యలు రావు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, బ్యాలెన్స్ డైట్ తీసుకోవడం వల్ల జుట్టు రాలదు.

సరైన పోషక పదార్థాలు అందకపోవడం వల్ల జుట్టు ఎక్కువ రాలుతుంది. కాబట్టి మంచి పోషక పదార్థాలను తీసుకుంటూ ఉండండి.

వీటితో పాటుగా జుట్టు సమస్యలు కలిగితే మరి కొన్ని టిప్స్ కూడా వున్నాయి. వాటినైనా అనుసరించవచ్చు.

**మరి కొన్ని టిప్స్ :**

**హెయిర్ ప్రొడక్ట్స్:** మార్కెట్లో వివిధ రకాల హెయిర్ ప్రొడక్ట్స్ దొరుకుతాయి. మీరు జుట్టుకు మేలు చేసే హెయిర్ ప్రొడక్ట్స్ ని ఉపయోగించి జుట్టురాలిపోవడం సమస్య నుండి బయట పడవచ్చు. వంటి పదార్థాలు జుట్టుకు మేలు చేస్తాయి. ఈ పదార్థాలు ఉండే సీరంని ప్రతి రోజు ఉదయం సాయంత్రం అప్లై చేసుకోండి. తద్వారా జుట్టు రాలకుండా ఉంటుంది.

**సప్లిమెంట్స్** : అన్ని పోషక పదార్థాలు ఆహారం ద్వారా అందవు. అందుకనే సప్లిమెంట్స్ ను తీసుకోండి. మల్టీవిటమిన్, ఫోలిక్ యాసిడ్, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, బయోటిన్ మొదలైన వాటిని తీసుకోవచ్చు.

**క్లినికల్ ట్రీట్మెంట్** : క్లినికల్ ట్రీట్మెంట్‌ను కూడా చాలా మంది చేయించుకుంటారు. advanced level of hair loss వంటివి మీరు తీసుకుని జుట్టు రాలిపోకుండా చూసుకోవచ్చు.

## బుద్ధ విగ్రహాన్ని ఇంట్లో ఎక్కడ పెడితే మంచిదంటే..



మైండ్‌ని చక్కగా ఉంచడానికి కూడా హెల్ప్ అవుతుంది. అయితే ఇటువంటివన్నీ జరగాలంటే మీరు ఏ చోట పెడుతున్నారనేది చాలా ముఖ్యం. మీ ఇంట్లో మీరు ఏ చోట బుద్ధ విగ్రహాన్ని ఉంచుతున్నారనేది చాలా అవసరం. పట్టించుకోకపోతే మాత్రం ఈ లాభాలను పొందడానికి అవ్వదు. అయితే మరి ఇప్పుడు ఎటువంటి ఆలస్యం లేకుండా బుద్ధుడి విగ్రహానికి సంబంధించిన ముఖ్యమైన విషయాలను చూద్దాం.

**ఇంటి ముఖద్వారం వద్ద బుద్ధుడి విగ్రహం :** ఇంటి ముఖద్వారం దగ్గర బుద్ధుడి విగ్రహం పెడితే ఏమవుతుంది అనేది చూస్తే.. బయట నుండి వచ్చే నెగిటివ్ ఫోర్స్‌ని ఆపుతుంది బుద్ధుడి విగ్రహం. చాలా మంది మొదట ఇంట్లోకి రాగానే ముఖ ద్వారం వద్ద ఏమున్నాయని చూస్తూ ఉంటారు. పైగా బుద్ధుడి విగ్రహం అక్కడ ఉండడం వలన దీవించినట్లు కూడా అవుతుంది. పైగా రాగానే అందంగా కనపడుతుంది. కాబట్టి ముఖద్వారం వద్ద బుద్ధుడి విగ్రహం ఉండడం కూడా మంచిదే. అయితే మీరు ముఖద్వారం వద్ద బుద్ధ విగ్రహాన్ని పెట్టేటప్పుడు దానిని నేల మీద నుండి మూడు నాలుగు అడుగుల దూరంలో ఉండేటట్లు చూసుకోండి. ఎప్పుడు కూడా గచ్చు పైన బుద్ధ విగ్రహాన్ని ఉంచేయొద్దు.

**లివింగ్ రూమ్‌లో బుద్ధుడి విగ్రహం :** చాలా మంది ఇళ్లల్లో బుద్ధుడి విగ్రహం పెడుతూ ఉంటారు. నిజానికి బుద్ధుడి విగ్రహాన్ని ఇంట్లో పెట్టడం వల్ల ప్రశాంతత నెలకొంటుంది. అంతే కాకుండా అందంగా కూడా ఇల్లు ఉంటుంది. చాలా మందికి ఏదైనా విగ్రహాలని ఇంట్లో పెట్టాలన్నా, లేదంటే ఏదైనా వస్తువులను ఇంట్లో ఉంచాలన్నా అనుమానం ఉంటుంది. ఏ దిక్కులో వీటిని ఉంచాలి..?, ఏ విధంగా పెట్టడం వల్ల మంచి కలుగుతుంది అని సందేహాలు తలెత్తుతాయి. అయితే బుద్ధుడి విగ్రహంలో చాలా మందిలో సందేహం ఉంది మీకు కూడా బుద్ధుడు విగ్రహాన్ని ఇంట్లో ఏ చోట ఉంచాలనే సందేహం ఉందా.. అయితే, తప్పకుండా మీరు దీని కోసం చూడాల్సిందే.

వాస్తు ప్రకారం చూసుకున్నట్లయితే బుద్ధుడి విగ్రహాన్ని పడమర దిక్కున ఉంచడం మంచిది. ఇది శాంతిని నెలకొల్పుతుంది. ఎప్పుడైనా సరే మీరు బుద్ధుడి విగ్రహాన్ని ఉంచాలంటే దానిని శుభ్రమైన టేబుల్ లేదా షెల్ఫ్‌లో ఉంచండి.

బుద్ధుడి విగ్రహం లివింగ్ రూమ్‌లో పెట్టినా ప్రశాంతత కలుగుతుంది. అలానే అందంగా కూడా ఇల్లు ఉంటుంది.

**గార్డెన్‌లో బుద్ధుడి విగ్రహం :** చాలా మందికి మొక్కలు పెంచడం అంటే ఎంతో ఇష్టం ప్రతి రోజు కూడా మొక్కలపై కాస్త సమయాన్ని వెచ్చిస్తూ ఉంటారు. మొక్కల్ని శుభ్రంగా ఉంచడం వాటిని సంరక్షణ చేయడం చాలా మందికి ఇష్టం. అయితే గార్డెన్‌లోనూ బుద్ధ విగ్రహాన్ని ఉంచొచ్చు. అయితే బుద్ధుడి విగ్రహం మెడిటేషన్ చేస్తున్నట్లుగా ఉంటే ఎంతో బాగుంటుంది. మీ గార్డెన్ లో ఒక పక్క దానిని ఉంచండి .ఇది మీకు మంచి కలిగేటట్టు చేస్తుంది. కంఫర్టబుల్గా రిలాక్స్‌గా ఉండేటట్టు చేస్తుంది. కనుక గార్డెన్‌లో కూడా మీరు బుద్ధ విగ్రహాన్ని ఉంచుకోవచ్చు. అయితే మీరు బుద్ధుడు విగ్రహాన్ని పెట్టేటప్పుడు మంచి సువాసన వచ్చే కొవ్వొత్తులు, స్టిక్స్‌ని వెలిగించవచ్చు. దీనివల్ల ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. మెడిటేషన్ చేస్తున్నప్పుడు కూడా ఇలా అనుసరించవచ్చు.

**పూజ గదిలో, మెడిటేషన్ గదిలో కానీ :** చాలామంది పూజ గదిలో పెట్టి బుద్ధుడిని పూజిస్తూ ఉంటారు. ఇది కూడా మంచి పాజిటివ్ ఎనర్జీని తీసుకు వస్తుంది. అదే విధంగా మెడిటేషన్ చేసే చోట కనుక మీరు బుద్ధుడు విగ్రహాన్ని ఉంచారంటే ఇది ఏకాగ్రతని మరింత పెంచుతుంది. తూర్పు వైపు కూడా బుద్ధ విగ్రహాన్ని పెట్టుకోవచ్చు. ఇది కూడా మంచి వైబ్స్‌ని తీసుకొస్తుంది. ఇలా మీరు పూజ గదిలో లేదా మెడిటేషన్ గదిలో బుద్ధుడి విగ్రహాన్ని ఉంచి ప్రశాంతతని పొందొచ్చు.


నిజానికి ఇంట్లో బుద్ధుడి విగ్రహం పెట్టడం వల్ల పాజిటివిటీ కలుగుతుంది అలానే మంచి జరుగుతుంది. అంతేకాకుండా ఇంటికి అందాన్ని బుద్ధుడి విగ్రహం తీసుకొస్తుంది. అయితే వాస్తు ప్రకారం చూసుకున్నట్లయితే బుద్ధ విగ్రహాన్ని చాలా చోట్ల పెట్టుకోవచ్చు. అయితే ఒక్కొక్క చోటకి ఒక్కొక్క విశిష్టత ఉంది. అలానే చోటును బట్టి ఇంటి పై ప్రభావం మారుతూ ఉంటుంది. బుద్ధుడి విగ్రహం ఇంట్లో ఉండడం వల్ల మానసిక ఆరోగ్యం మరియు శాంతి పై కూడా ప్రభావం చూపిస్తుంది.

**పిల్లలు గదిలో కానీ స్టడీ రూమ్‌లో కానీ :** అయితే విగ్రహాలలో చాలా రకాలు ఉంటాయి. బుద్ధుడి విగ్రహాలు కూడా చాలా రకాలు ఉన్నాయి. వివిధ రకాల బుద్ధుడి విగ్రహాలు ఉన్నాయి. కనుక వాటి యొక్క అర్థాలు కూడా వేరుగా ఉంటాయని మీరు గమనించాలి. ఒకవేళ కనుక మీ పిల్లలు చదువు పట్ల ఆసక్తి పొందాలంటే చిన్న బుద్ధుడు తలని వాళ్ల గదిలో ఉంచండి. దీని వల్ల వల్ల ఏకాగ్రత పెరుగుతుంది. ఇలా కూడా మీరు చేయవచ్చు దీనివల్ల కూడా ఎంతో మంచి కలుగుతుంది.

**డైనింగ్ టేబుల్, మెయిన్ ఎంట్రన్స్ దగ్గర :** హ్యాండ్ పెయింటింగ్స్ వంటివి పెట్టుకోవాలంటే ఇదే మంచి ప్రదేశం. ఏదైనా పెయింటింగ్‌ని తగిలిస్తే అది ఎంతో అందంగా ఉంటుంది అలాగే ఇంటికి మంచి అందాన్ని తీసుకొస్తుంది. కాస్త సులువుగా ఉండే పెయింటింగ్ మీరు ఎంచుకోవచ్చు. దీనితో ఇంటి అందమే మారిపోతుంది. మీరు మీకు నచ్చిన పెయింటింగ్ ని మీ లివింగ్ రూమ్‌లో కానీ డైనింగ్ టేబుల్ వద్ద కానీ తగ్గించుకోవచ్చు.

**బుక్ షెల్ఫ్, గ్లాస్ షెల్ఫు పైన :** మీరు బుక్ షల్ఫు లేదా గ్లాసు షల్ఫు పైన బుద్ధ విగ్రహం ని లేదా లాఫింగ్ బుద్ధని పెట్టుకోవచ్చు. అయితే లాఫింగ్ బుద్ధ, బుద్ధుడి విగ్రహం రెండు ఒకటి కాదు కానీ రెండూ ఆనందాన్ని తీసుకువస్తాయి. అలానే ప్రశాంతంగా ఉంచుతాయి. కనుక మీరు వీటిని ఇంట్లో ఉంచినా కూడా మంచిదే. అయితే మీరు పుస్తకాల షెల్ఫ్ మీద పెట్టినప్పుడు తూర్పు వైపు ఉండేటట్లు చూసుకోండి.

## ఇవి తింటే వర్షాకాలం అనారోగ్య సమస్యలకు చెక్



వర్షాకాలంలో ఆరోగ్యంపై జాగ్రత్త చాలా అవసరం. వివిధ ఇన్‌ఫెక్షన్లు, రోగాలు వెంటాడుతుంటాయి. అయితే కొన్ని రకాల ఆహార పదార్థాల్ని తీసుకుంటే ఆ సమస్యలకు చెక్ పెట్టవచ్చు.

భగభగమండే ఎండల్నించి వర్షాకాలం ఉపశమనం కల్గించినా..ఆరోగ్యపరంగా వర్షాకాలం ఎప్పుడూ మంచిది కాదు. వివిధ రకాల ఇన్‌ఫెక్షన్లు దాడి చేసి అనారోగ్యానికి కారణమౌతుంటాయి. వర్షాకాలంలో తల వెంట్రుకల్నించి చర్మం వరకూ అనేక సమస్యలు ఎదుర్కోవల్సి వస్తుంటుంది. వర్షాకాలంలో శరీరంలోని రోగ నిరోధక శక్తి కూడా తగ్గుతుందని వైద్య నిపుణులు చెబుతుంటారు. అందుకే తినే ఆహార పదార్థాల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే సరిగ్గా జీర్ణ కాక సమస్యగా మారుతుంది. కడుపు సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో కొన్ని రకాల ఆహార పదార్థాలు తినడం ద్వారా కడుపు సంబంధిత సమస్యల్నించి ఉపశమనం పొందవచ్చు. ఆ వివరాలు మీ కోసం..

**కడుపులో సమస్యలకు చెక్** : పెరుగు పోషక పదార్థాలతో నిండి ఉంటుంది. వర్షాకాలంలో వివిధ ఇన్‌ఫెక్షన్ల కారణంగా లేదా చెడు ఆహార పదార్థాల కారణంగా కడుపు సంబంధిత సమస్యలు తలెత్తినప్పుడు సాధ్యమైనంతవరకూ పెరుగు మాత్రమే తీసుకోవాలి. పెరుగు ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో పుష్కలంగా ఉండే ప్రో బయోటిక్స్ ప్రేగుల్లోని గుడ్ బ్యాక్టీరియాను వృద్ధి చేస్తాయి.

# ఇది ప్రజా ప్రభుత్వమా ? లేక నియంత ప్రభుత్వమా ?



**పిఠాపురం, (విశాఖ సమాచారమ్):** జాతీయ పార్టీ అధ్యక్షులు నారా చంద్ర బాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర తెలుగు యువత,టి.యన్.ఎస్. ఎఫ్ ఆధ్వర్యంలో నిరుద్యోగ రణం లో భాగంగా, అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాని కి వెళ్ళనియకుండా నిన్న రాత్రి నుండి ఇప్పటి వరకు మా ఇళ్ల దగ్గర పోలీసు లను కాపలా పెట్టిన ఈ వైసీపీ ప్రభు త్వాన్ని ఏమనాలి,ఇది ప్రజా ప్రభుత్వమా, లేక నియంత ప్రభుత్వమా?

జగన్ రెడ్డి మీరు ఎన్నికలకు ముందు మరియు అసెంబ్లీ సాక్షిగా నిరుద్యో గులకు జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాను అని చెప్పి మూడున్నర సంవత్స రాలు అవుతుంది, ప్రతి సంవత్సరం మీరు విడుదల చేస్తానన్న జాబ్ క్యాలెం డర్ ఎక్కడ, ప్రతి సంవత్సరం మీరు చెప్పిన మెగా డీఎస్సీ ఎక్కడ , రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో 2.35 లక్షల పైన ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి,ఎప్పుడు భర్తీ చేస్తారు.రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు లేక కూలీ పనులకు మరియు మాధకద్రవ్యాలకు చెడు మార్గాలు ఎంచుకుంటున్నారు. కావున ఇప్పటికైనా జాబ్ క్యాలెండర్ విడుదల చెయ్యాలి అని,యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పిఠాపురం నియోజకవర్గ తెలుగు యువత,టి.యన్.ఎస్. ఎఫ్ టీడీపీ తరపున డిమాండ్ చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు నల్లా శ్రీనువాసు ,నియోజకవర్గ అధ్యక్షులు రావు అక్షయ్,,టి.యన్.ఎస్. ఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి పేచెట్టి వీరు నాయుడు,పిఠాపురం పట్టణ తెలుగు యువత అధ్యక్షులు పెద్దిరెడ్ల నంది బాబు,కొత్తపల్లి మండల తెలుగు యువత అధ్యక్షులు దుళ్ళ సత్తిబాబు, ఐ టీడీపీ నియోజకవర్గ అధ్యక్షులు అంకంరెడ్డి వినయ్,గొల్లప్రోలు మండల అధ్యక్షులు బడిగంటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థీ లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి

**విజయనగరం:** ప్రతి విద్యార్థీ లక్ష్యాన్ని నిర్ణయించుకొని, దానిని సాధించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి కోరారు. పదోతరగతి లోపే తమ లక్ష్యాన్ని నిర్ధేశించుకోవాలని సూచించారు. ఎస్.కోట మండలం ధర్మవరం జిల్లా పరిషత్ పాఠశాలలో ఆధునీకరించిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ డిజిటల్ లైబ్రరీ ని, శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ లైబ్రరీ ఆధునీకరణకు, గ్రామానికి చెందిన లోతేటి సన్యాసప్పడు ఆర్థిక సాయం అందించగా, అతని కుమారుడు, పాఠశాల పూర్వ విద్యార్థి, పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సభలో కలెక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ, మాతృ రుణం, పితృరుణం, గురు రుణం, జన్మభూమి రుణం ప్రతీఒక్కరూ ఎంతోకొంత తీర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మనకు పాఠాలు చెప్పిన గురువులను ఎన్నడూ మర్చిపోరాదని, మంచి గురువును చూసి స్ఫూర్తి పొందాలని సూచించారు. పూర్వ విద్యార్థిగా, పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న శివశంకర్‌ను అభినందించారు. బహుద స్వచ్ఛంద సంస్థను ప్రారంభించి, సేవ చేస్తుండటం ప్రశంసనీయమన్నారు. ఎంత ఉన్నత స్థానానికి ఎదిగినా, సమాజానికి మనం తిరిగి కొంత ఇవ్వాల్సి ఉందన్నారు. విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానం సాధించాలంటే, ఒక లక్ష్యాన్ని నిర్ధేశించుకోవాల్సి ఉందన్నారు. ప్రక్కదారి పట్టించే ఎన్నో సాధనాలు ఇప్పుడూ మన చుట్టూ ఉన్నాయని, దారితప్పకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. పల్నాడు కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ, ఏ వ్యక్తి అయినా ఉన్నత స్థానం చేరుకోవడానికి పుస్తకాలు సోపానమని అన్నారు. పుస్తకాలను చదవడం ద్వారా జ్ఞానాన్ని, తద్వారా జీవితాన్ని చక్కదిద్దుకోవచ్చని సూచించారు. అత్యధిక సమయం గ్రంథాలయంలో గడిపిన వ్యక్తులంతా, అత్యున్నత స్థానాలకు చేరుకున్నారని ఉదహరించారు. తనకు చిన్నప్పటినుంచీ తెలుగు సాహిత్యంపై ఉన్న అభిమానం, ఐఎఎస్ సాధనకు దోహదపడిందన్నారు. తనకు ప్రేరణ ఇచ్చిన ఉపాధ్యాయులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. మనం చిన్నప్పుడు పాఠ్యపుస్తకాల్లో చదివిన నీతి కథలు, మహనీయుల జీవిత గాథలను చూసి స్ఫూర్తి పొందవచ్చని చెప్పారు.

# బిజెపి వ్యతిరేక విధానాలు తిప్పి కొట్టాలి



**పార్వతీపురం మన్యం, (విశాఖ సమాచారమ్):** బిజెపి అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. శుక్రవారం బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 14 నుండి 27 వరకు దేశ రక్షణ భేరి ప్రచార యాత్ర సంధర్భంగా పార్వతీపురం మండలం రావికోన పంచాయితీ రంగాలగూడ గ్రామంలో పార్టీ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ ప్రజలను పీడించి కార్పొరేట్లకు దోచిపెట్టడం, రాష్ట్రాలకి ద్రోహం -రాజ్యాంగానికి తూట్లు, మతోన్మాదంతో ప్రజల విద్వేషం, విచ్చిన్నం ఇదే బీజేపీ (మోడీ) ప్రభుత్వం చేస్తున్న పనని విమర్శించారు. 75 ఏళ్ల భారత ప్రజలు నిర్మించుకున్న పరిశ్రమలు, ఇన్సూరెన్స్, బ్యాంకులు, రైల్వేతో సహా దేశ సంపద మొత్తం కార్పొరేట్లకు ఇచ్చేసి, బీజేపీ కార్మిక, కర్షకుల హక్కులు కాలరాస్తున్నారన్నారు. పంచాయితీ సర్పంచ్ కె. రామస్వామి మాట్లాడుతూ జనం తిరగబడకుండా మత ఘర్షణలతో ప్రజలను బిజెపి అనైక్య పరుస్తున్న బిజెపి దుష్ట విధానాలపై సెప్టెంబర్ 26 న పార్వతీపురంలో జరిగే బహిరంగ సభలో రాష్ట్ర సిపిఎం కార్యదర్శి కామ్రేడ్ వి.శ్రీనివాసరావు పాల్గొంటున్నారని, ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సభ్యులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

# నిరంతర ప్రయత్నం తోనే విజయం



**పార్వతీపురం మన్యం, (విశాఖ సమాచారమ్):** నిరంతర ప్రయత్నం, శ్రమ తోనే విజయం సాధ్యమని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. శుక్రవారం వేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన మెగా జాబ్ మేళాను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ మాట్లాడుతూ జాబ్ మేళాలో పదమూడు కంపెనీలలో సుమారు ఏడువందల తొంబదిఅయిదు వివిధ రకాల ఉద్యోగాలకు ఈరోజు ఇంటర్యూలు నిర్వహిస్తుండగా పదహేను వందలకు పైగా అభ్యర్థులు హాజరయ్యారన్నారు. ఇందులో ప్రతి ముగ్గురిలో ఒకరికి ఉద్యోగం వస్తుందని, మిగిలిన వారు నిరుత్సాహపడకుండా మరల ప్రయత్నం చేయాలన్నారు. కార్యసాధనలో నిరతరం ప్రయత్నం చేయాలని, కష్టపడితే విజయం సొంతమవుతుందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు పొందుటకు వారికి అవసరమైన సాంకేతిక నైపుణ్యాలు కల్పించుటకు రాష్ట్రంలో 65 నియోజకవర్గాలలో స్కిల్ హబ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దానిలో భాగంగా పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురం, సీతంపేటలలో ఈ కేంద్రాలు ఏర్పాటు చెస్తున్నట్లు తెలిపారు. కంపెనీలతో అవగాహన ఏర్పాటుచేసుకొని వారికి వారి కంపెనీలలో ఉద్యోగాలకు కావలసిన నైపుణ్యాలపై అభ్యర్థులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగఅవకాశాలు కల్పించటం ఈ హబ్ ల యొక్క ఉద్దేశ్యమని తెలిపారు.

ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు నిబద్ధత, నిజాయతీతో పనిచేసి మంచి స్థాయికి చేరాలన్నారు. ఉద్యోగ నిర్వహణలో యిబ్బందులు ఎదురైనా వాటిని ఎదుర్కొని ముందుకు సాగాలన్నారు. చాలామంది ప్రముఖులు వారి జీవితాలను చిన్నస్థాయినుంచే ప్రారంభించారని గుర్తుచేసారు. జాబ్ మేళాలు ఎప్పటికప్పుడు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎక్కువ కంపెనీలు వస్తే మెగా జాబ్ మేళా ఏర్పాటు చేస్తామని తెలిపారు.ఈ జాబ్ మేళాలో సైనప్టిక్ కంపెనీలో ట్రైనింగు కెమిస్ట్ గా ఉద్యోగాలు పొందిన గుమ్మలక్ష్మీపురం కడెమి కొత్తగూడకు చెందిన బి.ఎస్.సి. చదివిన బిడ్డిగ సురేష్, కొమరాడమండలం కోదులగొండ గ్రామానికి చెందిన ఇంటర్మీడియెట్ చదివిన మోసూరు రాజశేఖర్ లకు నియామకపత్రాలు అందజేసారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయి కుమార్ మాట్లాడుతూ జాబ్ మేళాలు నిరంతరం నిర్వహిస్తామని, ఎక్కువ మంది యువతకు ఉద్యోగ అవకాశశాలు కల్పించుటకు కంపెనీలతో మాట్లాడి జాబ్ మేళాలు ఎక్కువకంపెనీలు వచ్చేటట్లు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్శన్ గౌరీశ్వరి, వైస్ చైర్ పర్శన్ రుక్మిణి, జిల్లా ఎంప్లాయిమెంటు అధికారి అరుణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చలపతిరావు యితర అధికారులు హాజరైనారు.

# జిల్లా మహా సభలు జయప్రదం చేయాలి



**పార్వతీపురం మన్యం, (విశాఖ సమాచారమ్):** జిల్లా ఎనిమిదవ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని గోడ పత్రిక విడుదల చేసిన జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి రామలక్ష్మి ,ఆర్ శ్రీదేవి మహాసభ బెలగాం చర్చి సెంటర్లో వేదాంత జూనియర్ కాలేజ్ వద్ద జరుగుతున్నాయిని 18వ తేదీ ఉదయం 10 గంటలకు ఆర్టిసి కాంప్లెక్స్ నుండి ర్యాలీ నిర్వహించబడు తుందని ఈ మహాసభకు ఐద్వా ఆలిండియా నాయకులు ఎస్ పుణ్యవతి హాజరుకానున్నారని జిల్లా కార్యదర్శి శ్రీదేవి తెలియ జేశారు. మహిళా సంఘం మూడు సంవత్సర కాలంలో మహిళపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా, మద్యం అమ్మకాలు నియంత్రించాలని ,ఉపాధి హామీ సమస్యల పరిష్కారం చేయాలని మహిళలకు రక్షణ కల్పించాలని ,ధరలు తగ్గించాలని అనేక సమస్యలపై పోరాటం చేస్తూ వస్తున్నది పట్టణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు ఇల్లు, ఇళ్ల స్థలాలు పార్వతీపురం ప్రాంతంలోకి టిట్కో ఇల్లు ఇచ్చిన వారికి వెంటనే మంజూరు చేయాలని ఆస్తి పన్ను చెత్త పన్ను రద్దు చేయాలని పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం అమలు చేయాలని అనేక పోరాటాలు నిర్వహించింది మహిళా సమస్యల పరిష్కారం నిరంతరం తన ఆందోళన కొనసాగిస్తూ భవిష్యత్ కర్త ఇవ్వాలని నిర్దేశించుకుంటూ తీర్మానాలు మహాసభలో చేయనున్నది చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని రాజ్యాంగం కల్పించిన హక్కును బిజెపి ప్రభుత్వం అటకెక్కించిందని వెంటనే 33% రిజర్వేషన్ చట్టసభల్లో ఆమోదించాలని తీర్మానం చేయనుంది గ్రామీణ ఉపాధి హామీని 200 రోజులకు పని పెంచి మహిళలకు ఉపాధి లభించే విధంగా చూడాలని తీర్మానం శ్రామిక మహిళల కనీస వేతనాలు ఉద్యోగ భద్రత పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని తీర్మానాలు చేస్తున్నది కావున మహిళలందరూ ఈ మహాసభను తీర్మానాలు పై చర్చ జరిపి ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారానికి సర్వచోబకపోతే భవిష్యత్తు ఆందోళన పోరాటం నిర్వహించటానికి ప్రణాళిక రూపొందించినది ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు మంగమ్మ ,భవాని ,తులసి ఇందిర పాల్గొన్నారు .

# దేశవ్యాప్తంగా సెల్లర్ సంవాద్ నిర్వహిస్తున్న గవర్నమెంట్ ఈ-మార్కెట్ ప్లేస్

**విజయవాడ(పీఐబీ):** వన్-స్టాప్ గవర్నమెంట్ ఇ-మార్కెట్ ప్లేస్ (జిఇఎం) - నేషనల్ పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ విక్రయ లబ్ధిదారులతో పరస్పర సంభాషణ చేయడానికి గవర్నమెంట్ ఇ-మార్కెట్ ప్లేస్ కొత్త ఫీచర్లు, కార్యాచరణల గురించి వారికి అవగాహన కల్పించడానికి దేశవ్యాప్తంగా 'సెల్లర్ సంవాద్'ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాలు 14 నుండి 23 సెప్టెంబర్ 2022 వరకు నిర్వహించ తలపెట్టారు. విజయవాడలో, సెల్లర్ సంవాద్ 2022 సెప్టెంబర్ 16న సీజీఓ కాంప్లెక్స్, 2వ అంతస్తు ఆటో నగర్‌లోని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహిస్తారు.

జిఇఎం వస్తువులు, సేవల సేకరణ కోసం పరిపూర్ణ ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్. ఇది గౌరవనీయులైన ప్రధాన మంత్రి దార్శనికత కారణంగా 2016 ఆగస్టు 9న ఉద్భవించింది. జిఇఎం పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్‌ను పునర్నిర్వచించటానికి కొత్త విధానంగా ప్రసిద్ధి చెందింది. ప్రభుత్వ కొనుగోలుదారులు ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా సేకరణ చేసే విధానంలో సమూల మార్పులను తీసుకురాగలిగింది. జిఇఎం అనేది కాంటాక్ట్ లెస్, పేపర్‌లెస్ క్యాష్‌లెస్ అనే మూడు స్తంభాలపై నిలుస్తుంది, అవి సమర్థత, పారదర్శకత చేరికల వల్ల సాకారమవుతుంది.

జిఇఎం 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఒకే ఆర్థిక సంవత్సరంలో సేకరణ విలువ లక్ష కోట్ల రూపాయిల మైలు రాయిని అధిగమించడం గమనార్హం. సంచితంగా, జిఇఎం ఐఎన్‌ఆర్ 2.82 లక్షల కోట్ల విలువైన 1 కోటి లావాదేవీలను చేసింది. దేశవ్యాప్తంగా కొనుగోలుదారులు అమ్మకందారులతో సహా వాటాదారుల సమిష్టి మద్దతుతో మాత్రమే ఇది సాధ్యమైంది.

జిఇఎం కొనుగోలుదారులు అన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, సహకార సంఘాలు ప్రభుత్వ రంగ సంస్థలలోనూ ఉంటారు. జిఇఎం విక్రేతల వైవిధ్య స్వభావం 'సమిష్టిత' స్తంభంపై స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. పెద్ద కంపెనీలు సమ్మేళనాల నుంచి ప్రారంభించి, విక్రేత బేస్‌లో దేశం నలుమూలల నుండి మహిళా పారిశ్రామికవేత్తలు, స్వయం-సహాయ సమూహాలు ఎంఎస్ఎంఇ విక్రేతలు ఉన్నారు. అంతేకాకుండా, ఎంఎస్ఎంఇలు ఎస్‌హెచ్‌జిల కోసం నిరంతరాయ ఆన్‌బోర్డింగ్ అనుభవాన్ని నిర్ధారించడానికి జిఇఎం పోర్టల్‌లో ప్రత్యేక నిబంధనలు కూడా సృష్టించారు. 61 వేల మంది నమోదిత ప్రభుత్వ కొనుగోలుదారులు 48.6 లక్షల మంది విక్రేతలు సర్వీస్ ప్రొవైడర్లు జిఇఎం కార్యకలాపాల పరిమాణం చెప్పుకోదగినంత పెద్దది.

జిఇఎం ప్రారంభం నుంచి, కొత్త ఉత్పత్తి సేవా వర్గాలను నిరంతరం జోడించడం ద్వారా క్రమంగా అభివృద్ధి చెందుతోంది. ప్రస్తుతం, జిఇఎంలో దాదాపు 300 సేవా వర్గాలు 10000+ కంటే ఎక్కువ ఉత్పత్తి వర్గాలు అందుబాటులో ఉన్నాయి. ఈ కేటగిరీలు దాదాపు 44 లక్షల ఉత్పత్తి సేవా సమర్పణల కేటలాగ్‌లను కలిగి ఉన్నాయి. ఇంకా, జిఇఎం అభివృద్ధి చెందుతున్న ప్లాట్‌ఫామ్ పోర్టల్‌కి కొత్త ఫీచర్లు కార్యాచరణలను జోడించడం కోసం అవిశ్రాంతంగా పని చేస్తుంది. ఈ సూత్రానికి అనుగుణంగా, గత 24 నెలల్లో సుమారు 2000 చిన్న 460ం ప్రధాన కార్యాచరణలు ప్రవేశపెట్టారు.

దీన్ని ఒక ఆచరణాత్మక ఆలోచనగా భావించి, భారతదేశ పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ ఎకోసిస్టమ్‌లో పెద్ద సంఖ్యలో అమ్మకందారులను జిఇఎం ప్రభావితం చేయగలిగింది. దీని ప్రకారం, పాన్-ఇండియా 'సెల్లర్ సంవాద్' జిఇఎం విక్రేతలతో పరస్పర కార్యకలాపాలు చేయడానికి పోర్టల్‌లో పనిచేయడానికి వారికి మరింత అనుకూలంగా ఉండే కొత్త జిఇఎం ఫీచర్లు కార్యాచరణ గురించి వారికి అవగాహన కల్పించడానికి ప్లాన్ చేశారు. సంవాద్ ద్వారా, ఈ అమ్మకందారులు వారి అనుభవాలను గురించి మాట్లాడటానికి ఇతరులతో నేర్చుకునేందుకు ప్రేరణ పొందేందుకు వాటిని పంచుకునేలా ప్రణాళిక రూపొందించారు.

(భారత ప్రభుత్వ వాణిజ్య శాఖ గవర్నమెంట్ ద్వారా సేకరించే పాత టెండర్ ప్రక్రియలో పారదర్శకతను తీసుకురావడానికి జిఇఎం (ప్రభుత్వ ఇ-మార్కెట్‌ప్లేస్) పోర్టల్‌ను అభివృద్ధి చేసింది. విభాగాలు. ప్రభుత్వ ప్రధాన లక్ష్యం ప్రభుత్వ సంస్థల నిర్వహణ సులభతరం చేయడం. డిపార్ట్ మెంట్ సరైన వాల్యూమ్, సరైన నాణ్యత, సరైన పరిమాణం తో నిర్దిష్ట సమయపాలనలో సరైన మూలాధారా లతో ఉత్పత్తులు/సేవలను సేకరించడం లక్ష్యం).


ఆహ్వానం

మాతా బుజ్జమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్

రిజిష్టర్డ్ నెం. 87/2017

విశాఖపట్నం

**మాతృమూర్తి సేవా పురస్కారం**

సెప్టెంబర్ 2022

తేది : 18-09-2022 (ఆదివారం) సా॥ 6-00 గంటలకు
వేదిక : విశాఖ పౌర గ్రంథాలయం, విశాఖపట్నం.

అతిథులు

కల్నల్ ప్రొఫెసర్ డాక్టర్ **జి.యస్.ఎన్. రాజు** గారు
ఉపకులపతి
సెంచూరియన్ విశ్వవిద్యాలయం

డాక్టర్ **మోపిదేవి విజయగోపాల్** గారు
ప్రముఖ మానసిక వైద్యులు,
కవి, రచయిత

శ్రీమతి **ఆలపాటి లక్ష్మి** గారు
ప్రముఖ రంగస్థల, టి.వి,
సినీ నటీమణి

శ్రీ **"పలాస" జనార్థన్** గారు
ప్రముఖ రంగస్థల,
సినీ నటులు, నిర్మాత

సమన్వయకర్త
హంస్యరత్న **శ్రీ వేముల భాస్కరాచారి**
లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ హోల్డర్

పురస్కారం స్వీకరించువారు
**శ్రీ యం. యస్. మాధవ్** గారు
కుమారి **షేక్ మదీనా (మల్లిక)** గారు
**శ్రీ గంటి వెంకట సంతోష్ అభినయ్** గారు

**ప్రత్యేక ఆకర్షణ**



అమ్మ పాటలు : శ్రీమతి టి.వి. భానుమతి, శ్రీమతి మాధురి గార్లు
నృత్యాలు : హిడెన్ స్ప్రౌట్స్ విద్యార్థులు

## పాము కరిస్తే ఇలా చేయండి చేయించండి

ఎంతటి విషపు పాము కరిచినా. ఇలా చేసి ప్రాణాలు రక్షించవచ్చు. గుర్తుపెట్టుకోండి, షేర్ చేయండి.

ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం దాదాపు 50 లక్షల మంది పాము కాటుకు గురవుతున్నారు. భారతదేశంలో ఈ సంఖ్య రెండు లక్షలని అంచనా.. మన దేశంలో దాదాపు 250 జాతుల పాములున్నప్పటికీ వాటిలో 52 విష సర్పాలు ఉన్నాయి. మన ప్రాంతంలో మాత్రం 5 పాములు అత్యంత విషాన్ని కల్గిఉన్నవి. అవి కరిస్తే మ్యాగ్జిమమ్ 3 గంటల్లో మనిషి చనిపోతాడు.. ఏదైనా ప్రథమ చికిత్స చేస్తే ఆ 3 గంటల వ్యవధిలోనే చేయాలి, లేకపోతే పాము కరిచిన ఆ వ్యక్తి మనకు దక్కడు.

కరిచిన పాము విషపుదా, మామూళుదా.? అని తెల్సుకోవాలంటే అది కరిచిన చోట ఎన్నిగాట్లున్నాయో చూడాలి. ఒకటి లేదా రెండు గాట్లు ఉంటే కరిచింది విషపు పాము అని, మూడు అంతకంటే ఎక్కువ గాట్లు ఉంటే అది విషరహిత పాము అని గుర్తించాలి.

విషపు పాము కరిస్తే కరిచిన చోట పాము విషం శరీరంలోకి వెళుతుంది. అక్కడి నుండి గుండెకు , గుండె నుండి అన్ని శరీరభాగాలకు చేరుతుంది. ఇలా విషం అన్ని శరీరభాగాలకు చేరే వరకు 3 గంటల సమయం పడుతుంది ఆలోపు చికిత్స చేయకుంటే మనిషి బతికే అవకాశాలు దాదాపు శూన్యం.

విషపు పాము కరిచిన వెంటనే. కాటు కు పైన అంటే గుండె వైపుగా బలంగా తాడుతో కట్టాలి. సూదిలేని సిరంజీని తీసుకోని ఆ గాట్లలో ఓ గాటు దగ్గర పెట్టి రక్తాన్ని గుంజాలి. మొదటగా రక్తం కాస్త నలుపు రంగులో ఉంటుంది అంటే అది విషతుల్యమైన రక్తం అని అర్థం ఇలా రెండు మూడు సార్లు రెండు గాట్ల వద్ద చేయాలి. ఇలా చేశాక మనిషి స్పృహలోకి వస్తాడు.

వాస్తవానికి పాము తన కోరల్లో ఉంచుకునే విషం 0.5 ML నుండి 2 ML వరకు మాత్రమే.!

ప్రతి ఒక్కరి ఇంట్లో హెూమియోపతి మెడిసిన్ అయిన NAJA- 200 ను 5ML బాటిల్ ఉంచుకోవాలి దీని ఖరీదు 5/- నుండి 10 రూపాయలే.దీనిని పాము కరిచిన వ్యక్తి నాలుక పై 10 నిమిషాలకోసారి 3 సార్లు వేస్తే పాము కరిచిన వ్యక్తి త్వరగా కోలుకుంటాడు.

తర్వాత డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లాలి.

# ఆదుకోమంటూ ఎవరిని అడిగినా పో పో మంటున్నారు

## ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆవేదన



అలాంటి పాకిస్థాన్ లో ఇటీవల అకస్మాత్తుగా ప్రభుత్వం మారిపోయింది. అంతలోనే వరదలు కమ్ముకొచ్చాయి. ఇంకేం.. ఇప్పటికే పెట్రోల్ ధరలు ఆకాశాన్నంటిన దేశంలో..ఇతర కష్టాలు పోగయ్యాయి. ఆదుకోమంటూ ఎవరిని అడిగినా పో పో మంటున్నారు. "కనీసం ఫోన్ చేసినా డబ్బు అడుగుతామని భయపడుతున్నారు. చాలా చిన్న దేశాలు కూడా మనల్ని దాటేసి ముందుకెళ్లాయి. వరదల ముందు కూడా మన దేశం ఆర్థికంగా అనేక సవాళ్లు ఎదుర్కొంది. వరదలు ఆ పరిస్థితిని మరింత దిగజార్చాయి" అంటూ సాక్షాత్తు ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆవేదన వ్యక్తం చేయడం పరిస్థితికి అద్దం పడుతోంది.

ఓ దేశం రెండు ముక్కలైంది.. ఒకటి ప్రజాస్వామ్యాన్ని నమ్ముకుని లౌకిక దేశంగా ప్రకటించుకుంది.. మరొకటి మతాన్ని నమ్ముకుని మత రాజ్యంగా ఏర్పడింది. మొదటి దేశం ప్రజాస్వామ్యంతో పరిపుష్టం అయింది. రెండో దేశంలో పైకి ప్రజాస్వామ్యం అంటున్నా.. అక్కడంతా సైనిక రాజ్యమే. ఒక దేశంలో సుస్థిర ప్రభుత్వాలుంటే.. రెండో దేశంలో ఎప్పుడు ప్రభుత్వాలు కూలుతాయో.. తెలియదు. ఆ రెండు దేశాలే భారత్ పాకిస్థాన్. ఆర్థికంగా బలమైన దేశంగా భారత్ ఎదుగుతుంటే.. పాకిస్థాన్ మాత్రం నానాటికీ అప్పుల్లో కూరుకుపోతోంది. ఎప్పుడు ఎవరు సాయం చేస్తారా? అని చూస్తోంది.

**చిప్ప పట్టుకుని అంటూ..** షెహబాజ్ మాటలను యథాతథంగా చెప్పాలంటే.. పాకిస్థాన్ ఏర్పాటు నుంచి ఆర్థిక కష్టాల్లోనే ఉన్నట్లు చెప్పుకొచ్చారు. "75 ఏళ్లుగా చిప్ప పట్టుకుని.. తిరుగుతూ అడుక్కుంటున్నాం. మా కంటే చిన్న దేశాలు కూడా ఆర్థిక రంగంలో మమ్మల్ని దాటిపోయాయి. ఇప్పుడు మా పరిస్థితి చాలా దారుణంగా ఉంది. మిత్ర దేశాలు కూడా మమ్మల్ని బిచ్చగాళ్లలా చూస్తున్నాయి" అని ఆయన అనడం గమనార్హం. ఈ వ్యాఖ్యలు ఏదో మంత్రి స్థాయి వ్యక్తి నుంచి వచ్చినవి అయితే వదిలేయొచ్చు. పాక్ లోని సంపన్న పంజాబ్ రాష్ట్రానికి మూడుసార్లు ముఖ్యమంత్రిగా చేసి.. మూడుసార్లు దేశ ప్రధాని అయిన నవాజ్ షరీఫ్ సొంత సోదరుడు ప్రస్తుత ప్రధాని నుంచి రావడం అంటే పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవచ్చు. తాను మిత్ర దేశాల్లో పర్యటించినప్పుడు డబ్బుల కోసమే వచ్చానను కుంటున్నారని.. మిత్ర దేశాధినేతలకు ఫోన్ చేసినప్పుడు ఇదే పరిస్థితి అని షహబాజ్ వాపోయారు.వరదలతో పాక్ కల్లోలం..

తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పాకిస్థాన్ను భారీ వరదలు పీకల్లోతు కష్టాల్లో పడేశాయి. దీంతో ఆ దేశం ఇప్పుడు ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తోంది. ఆదుకోవాలని ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చినప్పటికీ.. స్పందన స్వల్పమే. దీంతోనే షహబాజ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేసినట్లు స్పష్టం అవుతోంది.

"వారంతా మేము భిక్షం అడుగుతామేమో అనే భావనలో ఉన్నారు. నిజంగానే పాకిస్థాన్లో ద్రవ్యోల్బణం తీవ్రంగా ఉంది. ఇప్పుడు పాకిస్థాన్ ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటోంది" అని వాపోయారు.వాస్తవానికి షహబాజ్ కంటే ముందు ఇమ్రాన్ ఖాన్ ప్రధాని గా ఉన్నప్పుడే పాక్ ఆర్థిక పరిస్థితి దిగజారింది. ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా పక్షం వహించి ఆయన పదవిని కోల్పోయారు. దీనివెనుక అమెరికా హస్తం ఉందనేలా ఇమ్రాన్ ఆరోపణలు చేశారు. అయితే.. షహబాజ్ వచ్చేసరికి పరిస్థితి మరింత దుర్భరమైంది. మూడు నెలల కిందటి వరదలు పాక్ ను నిండా ముంచేశాయి. 1500 మంది ప్రాణాలు కోల్పోయారు. దేశంలోని ప్రతి ఏడుగురిలో ఒకరు వరదల ప్రభావానికి గురయ్యారు. రూ.లక్ష కోట్ల నష్టం వాటిల్లింది. 78 వేల చదరపు కిలోమీటర్ల మేర పంటలు మునిగిపోయాయి. 3.3కోట్ల మంది ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. మూడోవంతు దేశం ఇప్పటికీ నీటిలోనే ఉంది. వరదల కారణంగా 12 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లింది.

**30 వేల కోట్లయినా దొరుకుతాయనుకుంటే..**

వైశాల్యం రీత్యా పాకిస్థాన్ మధ్య స్థాయి దేశం. వ్యవసాయికంగా మంచి భూములున్నాయి. పారిశ్రామిక ప్రగతికి అనుకూల వాతావరణం ఉంది. కానీ పాలకుల తీరుతో ఆ దేశంలో ఆర్థిక సంక్షోభం నెలకొంది. వనరుల సద్వినియోగం కొరవడి దుర్భర పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనికితోడు మూడో వంతు కాలం సైనిక పాలనే. వాస్తవానికి సైనిక పాలనలో ఏదంటే అది చేయడానికి అవకాశం ఉంటుంది. దాని ద్వారా యంత్రాంగాన్ని శాసిస్తూ ప్రగతికి బాటలు వేయొచ్చు. కానీ పాకిస్థాన్ లో అలా జరగలేదు. సరికదా.. మరింత అధ్వానంగా మారింది.

ఇక కనీసం రూ. 32 వేల కోట్ల మేర అప్పుదొరుకుతుందేమోనని ఇంటర్నేషనల్ మోనిటర్ ఫండ్(ఐఎంఎఫ్) వద్ద ప్రయత్నాలు చేస్తుంటే.. అకాల వర్షాలు వరదలతో ఆర్థిక వ్యవస్థ మొత్తం అస్తవ్యస్థమైపోయింది"అని ప్రధాని షెహబాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకులు ఐఎంఎఫ్ నిబంధనలను ఉల్లంఘించిన పాపానికి.. ఇప్పుడు ఆ సంస్థ చేపట్టే కొన్ని కార్యక్రమాలను కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. అతికష్టమ్మీద చేసిన ప్రయత్నాలతో ఐఎంఎఫ్ రూ. 14 వేల కోట్లను విడుదల చేసిందని చైనా వంటి మిత్ర దేశాలు మరో రూ. 32 వేల కోట్ల మేర అప్పు ఇచ్చాయని పేర్కొన్నారు. పాక్లో వరద బాధితులను ఆదుకునేందుకు 150 మిలియన్ డాలర్ల ఆర్థిక సాయం చేయాలని ఐక్యరాజ్య సమితి పిలుపునిచ్చింది. అయితే ఇప్పటివరకు కేవలం 38 మిలియన్ డాలర్లు మాత్రమే సమకూరినట్లు ఐరాస వెల్లడించింది. అమెరికా కెనడా యూకే జపాన్ డెన్మార్క్ సింగపూర్ సహా పలు దేశాలు పాక్కు సాయం ప్రకటించాయి.

## నేడు మెగా రక్తదాన కార్యక్రమం



**పార్వతీపురం మన్యం, (విశాఖ సమాచారమ్):** మెగా రక్తదాన కార్యక్రమం శని వారం నిర్వహిస్తున్నట్లు జిల్లా టిబి, లెప్రసీ, ఏయిడ్స్ అధికారి మరియు జిల్లా బ్లడ్ బ్యాంక్ నియంత్రణ అధికారి డా.సిహెచ్.విజయ్ కుమార్ తెలిపారు. పార్వతీపురం మెయిన్ రోడ్ బెలగం ఎల్.ఐ.సి కళ్యాణమండపంలోను, గుమ్మ లక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా రక్త దాన కార్యక్రమం జరుగుతుందని శుక్ర వారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన చెప్పారు. భారతదేశ మంతట మేగా రక్తదాన కార్యక్రమం ఏర్పాటు చేసి ఒక్క రోజులో "లక్ష రక్త యూనిట్లు" సేకరించుట లక్ష్యంగా భారత ప్రభుత్వం సెప్టెంబరు 17వ తేదిన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. "రక్త దానం చేయడం - సంఘీభావము చాటడం. చేయి,చేయి కలుపుదాం-ప్రాణాలను కాపాడుదాం" నినాదంతో కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని ఆయన వివరించారు. రక్త దాన కార్యక్రమంలో వెయ్యి యూనిట్లు వస్తాయని అంచనా ఉందని ఆయన తెలిపారు. జాతీయ రక్త దాన పక్షోత్సవాలుగా సెప్టెంబరు 17వ తేది నుండి అక్టోబరు 1వ తేదీన వరకు నిర్వహించడం జరుగుతోందని ఆయన చెప్పారు. పక్షోత్సవాలలో సుమారు 20 స్వచ్చంద రక్త దాన శిబిరాలు ఏర్పాటు చేయుటకు ప్రణాళిక చేసామని ఆయన అన్నారు. మెగా రక్త దాన కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛంద రక్త దాతలు తమ పేర్లను ఇ-రక్త కోష్ (https://www.eraktkosh.in) యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని విజయ కుమార్ తెలిపారు. స్వచ్ఛంద రక్త దాన శిబిరాల ఏర్పాటుకు జిల్లాలో గుర్తింపు పొందిన రక్త నిధి కేంద్రం లేదా జిల్లా టిబి, లెప్రసి, ఎయిడ్స్ అధికారిని సంప్రదించి కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన కోరారు. జిల్లాలో యువత, స్వచ్ఛంధ సంస్థలు, ప్రభుత్వ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది, ఇతర సామాజిక సంస్థలు అందరూ ముందుకు వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వివరాలకు డా. వినోద్ కుమార్, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్, పార్వతీపురం - 80083 11511?, డా. విజయ్ కుమార్, జిల్లా టిబి, లెప్రసి, ఏయిడ్స్ అధికారి - 8686717121ని సంప్రదించవచ్చని ఆయన చెప్పారు.

# జనసేన కండువా కప్పుకొనున్న వంగవీటి రాధా?

## విజయవాడ సెంట్రల్ నుంచి పోటీ!



**విజయవాడ:** విజయవాడలో ప్రముఖ రాజకీయ కుటుంబానికి చెందిన వంగవీటి రాధాక్రిష్ణ వచ్చే ఎన్నికల కోసం భారీ స్కెచ్ వేశారు. తాను ఎంతో ఇష్టపడే విజయవాడ సెంట్రల్ నుంచి పోటీ చేయడానికి ఆయన ఒక కరెక్ట్ రూట్ ని ఎంచుకున్నారు అని చెబుతున్నారు. ఆయన సాధ్యమైనంత త్వరలో జనసేనలో చేరిపోవడం ఖాయం అన్న ప్రచారం ఇపుడు ఊపందుకుంది.

ఆ మధ్యన జనసేన కీలక నాయకుడు నాదెండ్ల మనోహర్ ఏకంగా వంగవీటి రాధా ఇంటికి వెళ్ళి మరీ ఏకాంత చర్చలు జరిపారు. ఈ చర్చలకు అంత రాజకీయ ప్రాధాన్యత లేదని అప్పట్లో రాధా నాదెండ్ల ఇద్దరూ చెప్పినా నాటి మాటలే నేడు ఆచరణకు కారణం అవుతున్నాయని అంటున్నారు. దీనిని బట్టి చూస్తే తొందర్లోనే వంగవీటి రాధా జనసేన కండువా కప్పుకుంటారు అని తెలుస్తోంది.అదే టైం లో ఆయన విజయవాడకు పవన్ వచ్చినపుడు జరిగే బహిరంగ సభలో చేరుతారు అని కూడా అంటున్నారు. ఇంతకీ రాధా టీడీపీలో ఉన్న నాయకుడు కదా. ఆ పార్టీ నుంచి జనసేనలోకి ఎందుకు వెళ్తున్నారు అంటే దానికి ఆయన కారణాలు ఆయనకు ఉన్నాయట. విజయవాడ సెంట్రల్ సీటు మీద కర్చీఫ్ కాదు మొత్తం పరచేసి బోండా ఉమ ఉన్నారు. ఆయన చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు. పైగా ఆయన ఆ సీటు నుంచి 2014 ఎన్నికల్లో గెలిచారు. ఇక 2019 ఎన్నికల్లో జస్ట్ పాతిక ఓట్ల తేడాతో ఓడిపోయారు.దాంతో వచ్చే ఎన్నికల్లో ఆయనకే ఆ సీటు కంఫర్మ్ అని టీడీపీలో వినిపిస్తున్న మాట. ఇక రాధ ఎన్ని పార్టీలు మారుతున్నా ఆయన కోరుకున్నది సెంట్రల్ సీటే. 2019 ఎన్నికల్లో కూడా జగన్ ఆయనకు తూర్పు సీటు ఇస్తామని చెప్పారు. మచిలీపట్నం ఎంపీ టికెట్ అని కూడా అన్నారు. కానీ విజయవాడ సెంట్రల్ మీదనే రాధా పట్టుబట్టి మరీ వైసీపీ నుంచి వెళ్లిపోయారు. అయితే ఆయన తరువాత టీడీపీలో చేరినా ఆ సీటు దక్కలేదు. టీడీపీ అధికారంలోకి వస్తే ఎమ్మెల్సీ సీటు ఇస్తామని రాధాకు చెప్పి ఆ పార్టీ తరపున ప్రచారం చేయించుకున్నారు.

కానీ టీడీపీ పవర్ లోకి రాలేదు వైసీపీ గెలిచింది. రాధా ఎటూ కాకుండా పోయారు. దాంతో ఆయన ఇపుడు మరోసారి తీవ్రంగా ఆలోచించి మరీ ఒక కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నారు అని అంటున్నారు. ఈసారి కూడా ఆయన ఉంటున్న టీడీపీలో టికెట్ దక్కదని తేలుతున్న నేపథ్యంలో జనసేన వైపు చూస్తున్నారు. ఇక వైసీపీలో రాధా చేరుతారు అని వినిపించినా అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఉన్నారు. ఆయన్ని కాదని జగన్ కూడా టికెట్ ఇవ్వరని అంటున్నారు.అయితే సామాజికసమీకరణలు పొత్తులు వంటివి కనుక తీవ్ర ప్రభావం చూపిస్తే జగన్ డెసిషన్ మారే అవకాశం ఉంది అంటున్నారు. ఇక కొడాలి నాని వల్లభనేని వంశీకు రాధా ఫ్రెండ్ కాబట్టి ఆ విధంగా వైసీపీలోకి ఆయన్ని తీసుకురావాలన్న ప్రయత్నాలు అయితే జరిగాయి. కానీ ఎందుకో ఇపుడు రాధా మనసు మార్చుకుని జనసేన వైపు వెళ్తున్నారు. ఆయనకు జనసేనతో మంచి సంబంధాలే ఉన్నాయి.అప్పట్లో అంటే 2009 ఎన్నికల్లో రాధా ప్రజారాజ్యం పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయారు. అయినా ఆ పార్టీలో కీలకంగా ఉన్న పవన్ తో ఆయనకు మంచి రిలేషన్స్ అలాగే కొనసాగుతూ వచ్చాయి. ఇపుడు పవన్ జనసేన పార్టీ పెట్టారు పైగా కోరి మరీ పిలుస్తున్నారు కాబట్టి రాధా ఆ వైపునకు చూడవచ్చు అని అంటున్నారు. అయితే ఇక్కడ మరో విషయం ఉంది. జనసేన టీడీపీలో మధ్య పొత్తులు కనుక ఉంటే అపుడు రాధా ఏం చేస్తారు అన్నదే ప్రశ్న.అపుడు కచ్చితంగా సెంట్రల్ సీటు బోండా ఉమాకే వెళ్తుంది. మరి తాను ఎంతో కోరుకున్న సీటు మళ్లీ మళ్లీ పార్టీలు మారినా దక్కదా అంటే రాధా ఏం చేస్తారో చూడాలి. లేదా రాధా కోసం పవన్ పట్టుబట్టి మరీ ఆ సీటుని బాబు నుంచి తీసుకుంటారా అన్నదే చర్చ. ఏది ఏమైనా రాధా కనుక జనసేనలో చేరితో కోస్తాతో పాటు గోదావరి జిల్లాలలో బలమైన ఉన్న ఒక సామాజికవర్గంలో ఊపు వస్తుంది. అది జనసేనకు ప్లస్ అవుతుంది అనడంలో సందేహం లేదు.

# పెరిగిన ధరలపై టీడీపీ సభ్యులు బాదుడే బాదుడు పేరుతో నినాదాలు



**అమరావతి:** ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో రెండో రోజు శుక్రవారం టీడీపీ ఎమ్మెల్యేలు సస్పెన్షన్ గురయ్యారు. ఏపీ అసెంబ్లీలో పెరిగిన ధరలపై టీడీపీ సభ్యులు బాదుడే బాదుడు పేరుతో నినాదాలు చేశారు. ఈ క్రమంలో స్పీకర్ తమ్మినేని సీతారం పోడియంను చుట్టుముట్టారు. దీంతో స్పీకర్ తమ్మినేని ఒకరోజు పాటు టీడీపీ సభ్యులను శాసన సభ నుంచి సస్పెండ్ చేశారు. టీడీపీ ఎమ్మెల్యేలు బయటకు వెళ్లడానికి ఇష్టపడకపోవడంతో వారిని మార్షల్స్ ద్వారా బలవంతంగా బయటకు తోసివేయించారు. నిత్యావసర ధరలపై టీడీపీ సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తమ్మినేని సీతారాం తిరస్కరించారు. పెరిగిన చార్జీలు పెరిగిన పన్నులపై చర్చించాలని టీడీపీ పట్టుబట్టింది. దీంతో సభలో గందరగోళ పరిస్థితి చోటు చేసుకుంది. దాంతో టీడీపీ సభ్యులు స్పీకర్ పోడియంను చుట్టుముట్టారు. "బాదుడే బాదుడు" అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. దీంతో స్పీకర్ తమ్మినేని వారిపై సస్పెన్షన్ వేటు వేశారు. 13 మంది టీడీపీ ఎమ్మెల్యేలు సస్పెండ్ అయినవారిలో ఉన్నారు.కాగా శాసనసభలో టీడీపీ సభ్యుల తీరుపై స్పీకర్ మండిపడ్డారు. "టీడీపీ సభ్యుల తీరును ప్రజలు గమనించాలి. అసెంబ్లీ అంటే టీడీపీకి గౌరవం లేదు. ఎప్పుడూ ఇదే విధంగా వ్యవహరిస్తోంది. తోటి సభ్యుల హక్కులను కాలరాస్తోంది. మీకు ప్రతిరోజు ఇదొక అలవాటుగా మారింది. మీ దుష్ప్రవర్తనకు మిమ్మల్ని ఒక రోజు పాటు సస్పెండ్ చేస్తున్నా. ప్రతి రోజు ఇదొక వ్యాపకం అయిపోయిందా మీకు? ఇంతకంటే వ్యాపకం లేదా మీకు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు."ఫుల్ దెమ్ అవుట్" అంటూ మార్షల్స్కు ఆదేశాలు జారీ చేశారు. స్పీకర్ తీరుపై టీడీపీ సభ్యులు నిప్పులు చెరిగారు. మార్షల్స్తో ఎలా బయటకు పంపుతారంటూ ప్రశ్నించారు. దీనితో స్పీకర్ స్పందిస్తూ "దె ఆర్ మార్షల్స్ ఆస్ ద స్పీకర్ అయామ్ డిక్లేరింగ్.. వన్స్ అయామ్ డిక్లేర్ యు షుడ్ నాట్ టేక్ ఎనీ మోర్ హియర్. తీసుకెళ్లండి" అంటూ మార్షల్స్ను స్పీకర్ తమ్మినేని సీతారం ఆదేశించారు.అసెంబ్లీ ప్రవర్తన నియమావళి సబ్ రూల్ 2 ప్రకారం.. టీడీపీ ఎమ్మెల్యేలు బెందాళం అశోక్ అచ్చెన్నాయుడు ఆదిరెడ్డి భవానీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి నిమ్మకాయల చిన్నరాజప్ప జోగేశ్వరరావు పయ్యావుల కేశవ్ మంతెన రామరాజు అనగాని సత్యప్రసాద్ డోలా బాలవీరాంజనేయులు వెలగపూడి రామకృష్ణ గొట్టిపాటి రవికుమార్లు ఒక రోజుపాటు సస్పెండ్ అయ్యారు.

# దివ్యాంగులు తప్పకుండా యూడీఐడీ కార్డులు పొందాలి




**విజయనగరం:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అన్ని రకాల సేవలూ, అమలు చేసే పథకాలు పొందేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం యూడీఐడీ(యునిక్ డిజబెలిటీ ఐడీ) కార్డును అందుబాటులోకి తీసుకొచ్చిందని దీనిని దివ్యాంగులందరూ తప్పకుండా ఆన్లైన్ ప్రక్రియ ద్వారా పొందాలని జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి సూచించారు. ఇక నుంచి అన్ని రకాల సేవలకూ యూడీఐడీ కార్డు ప్రామాణికం కానుందని కావున వీలైనంత త్వరగా ప్రతి ఒక్కరూ దీన్ని తీసుకోవాలని చెప్పారు. యూడీఐడీ(యునిక్ డిజబిలిటీ ఐడీ) కార్డుల జారీ ప్రక్రియపై అవగాహన కల్పించే నిమిత్తం స్థానిక యూత్ హాస్టల్లో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్డులను అన్ని చోట్లా అంగీకరించేలా అన్ని శాఖలకూ లేఖలు రాసి పంపించాలని విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయక సంచాలకులకు ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. భవిష్యత్తులో అన్ని కార్యకలాపాలు యూడీఐడీ కార్డుపై ఆధారపడే జరుగుతా యని ఆమె పేర్కొన్నారు. రాష్ట్రంలోనే ప్రథమంగా విజయ నగరం జిల్లాలో ఈ ప్రత్యేక క్యాంపు పెట్టామని దీనిని అందరూ సద్వినియోగం చేసుకొని కార్డులు పొందాలని సూచించారు. అనంతరం యూడీఐడీ ప్రోగ్రాం రాష్ట్ర కో-ఆర్డినేటర్ జి. సురేష్ కార్డు పొందే విధానంపై అవగాహన కల్పించారు. కార్డు కావాల్సిన వారు https://www.swavlambancard.gov.in అనే సైట్ ద్వారా దరఖాస్తు పెట్టుకోవాలని సూచించారు.

**ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి:** కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కాసేపు దివ్యాంగులతో ముచ్చటించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అంగవైకల్యం అనేది మనం కోరుకుంటే వచ్చింది కాదని.. దాని గురించి ఆలోచిస్తూ ఆత్మన్యూనతా భావానికి గురికావొద్దని ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని ఈ సందర్భంగా కలెక్టర్ వారిలో ధైర్యం నింపారు. ప్రణాళిక ప్రకారం అత్యున్నత స్థానాలకు చేరుకొని ఇతరులకు ఆదర్శంగా నిలివాలని స్ఫూర్తి నింపారు. ఇతరులపై ఆధారపడకుండా స్వశక్తితో ఎదగాలని.. సమాజం గర్వించదగ్గ విజేతలుగా నిలవాలని పేర్కొన్నారు.

కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల విభాగం సహాయ సంచాలకులు జగదీష్, గురుదేవా ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు జగదీష్ బాబు, ద్వారకామయి అంధుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆశాజ్యోతి, వివిధ సంస్థల నిర్వాహకులు, పాఠశాలల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# హిజ్రాలకు వైద్య ధృవీకరణ పత్రాలు

**పార్వతీపురం మన్యం, (విశాఖ సమాచారమ్):** హిజ్రాలకు వైద్య ధృవీకరణ పత్రాలను జారీ చేయడం జరుగుతుందని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు యం. కిరణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్ర వారం ఒక ప్రకటన విడుదల చేశారు. ట్రాన్స్ జెండర్లకు (హిజ్రాలు) శ్రీకాకుళం రిమ్స్ జనరల్ ఆసుపత్రి, విజయనగరం జనరల్ ఆసుపత్రిలో వైద్య దృవ పత్రాలు జారీచేయడం జరుగుతుందని అన్నారు. వైద్య దృవ పత్రాలు పొందిన హిజ్రాలకు డి.ఆర్.డి.ఎ ద్వారా రూ.3 వేల పింఛను మంజూరు చేయడం జరుగుతుందని ఆయన వివరించారు. ఆన్ లైన్ లో వైద్య, ఆరోగ్య https://transgender dosje.gov.in వెబ్ సైట్ లో హిజ్రాలకు పత్రాలు, గుర్తింపు కార్డులు జారీ చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. హిజ్రాలకు అమలు చేస్తున్న సౌకర్యాలు, రాయితీలను పొందేందుకు, వారికి అవసరమైన సహాయాన్ని అందించడానికి వారి గుర్తింపు కోసం వైద్య ధృవపత్రాలు, గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని చెప్పారు. ప్రభుత్వం నుండి ఏదైనా ఆర్థిక సహాయం పొందాలనుకునే వ్యక్తులకు ధృవీకరణ తప్పనిసరి అని, రేషన్ కార్డులు, ఇంటి స్థలం పట్టాలు, ఇంటి నిర్మాణం, ఆధార్ కార్డులు, ఇతర ప్రయోజనాలను అందించడం వంటి వివిధ ప్రభుత్వ శాఖలు అందించే పథకాల ప్రయోజనాలను పొందడానికి "హిజ్రాలు" అని గుర్తించుటకు పత్రాల జారీ ప్రక్రియను ప్రభుత్వం అభివృద్ధి చేసిందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. వివరాలకు సహాయసంచాలకులు, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఫోన్ 08942-240519 నంబరుకు సంప్రదించాలని ఆయన కోరారు.

# అవినీతిపరులకు కొమ్ముకాస్తున్న డిసిసిబి పాలకవర్గం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** విశాఖ జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో అవినీతి అధికారులకు బ్యాంకుపాలకవర్గం కొమ్ము కాస్తుందని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, అనకాపల్లి వ్యవసాయదారుల సంఘం ఉపాధ్యక్షుడు విల్లూరి పైడారావు ఆరోపించారు. శుక్రవారం ఇక్కడ ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.జిల్లాలో98 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో నాలుగు లక్షల 50 వేల మంది సభ్యులకు అన్యాయం తలపెట్టిన తన్నారు అలాగే విశాఖపట్నం జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో నాలుగు లక్షల 50 వేల మంది సభ్యులు ఉన్నారని అందులో 1,50,000 ఇంతవరకు కేంద్ర సహకార బ్యాంకు నుండి పిఎసిఎస్ ద్వారా రుణాలు తీసుకుంటున్నారని వీరిలో ఎవరు సకాలంలో రుణం కట్టకపోయినా రైతులు ఇల్లు జప్తు చేసి రుణాలు వసూలు చేస్తున్నారని అలా రైతులు కట్టిన సొమ్ము మూడు కోట్లు దుర్వినియోగమైన పాలకవర్గానికి చీమకుట్టినట్టు కూడా లేదని పైడారావు ఆవేదన వ్యక్తపరిచారు.

మూడు కోట్లు అవినీతి జరిగిందని సెక్షన్ 51 ప్రకారంగా అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సహకార సంఘాల రిజిస్టర్ ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ దానిని జిల్లాలో ఉన్న సహకార సంఘ అధ్యక్షులకు తెలియకుండా వారితో జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేయకుండాఅవినీతిఅధికారులని కాపాడటం చాలా విచారకరమని పైడారావుఅన్నారు

ప్రస్తుతం జిల్లాలో ప్రభుత్వం చేత నియమింప బడిన పాలకవర్గాలు ఉన్నాయని వారు బ్యాంకుకు నష్టం కలిగించే వారిపై వెంటనేచర్యలు తీసుకోవాలని జిల్లాపాలకవర్గాన్ని కోరాలని అన్నారు.జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధికారులు బ్యాంకును కృత్రిమలాభాల్లో చూపించటానికి పిఎసియస్ లను నష్టాలు ఊబిలోకి తోసేస్తున్నారని ,సంఘాలలో రైతులు నుంచి వసూలు చేసిన సొమ్మును కేంద్ర సహకార బ్యాంకు ముందు వడ్డీ తీసుకోవడం వలన సంఘాలు నష్టాల్లోకెళ్ళిపోతున్నాయని ఇది సంఘ అధ్యక్షులు గమనించాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ బొట్టా చిన్ని యాదవ్ కోరారు.

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పాలకవర్గం వారు మూడు కోట్ల అవినీతిపై స్టే ఉన్నాదని కుంటి సాకులు చెబుతన్నారని స్టే వెకేట్ కు ఎటువంటి చర్యలు తీసుకుందో సహకార సంఘాల అధ్యక్షులకు తెలియచేయవసిన అవసరం జిల్లా పాలకవర్గానికి ఉన్నదని అనకాపల్లి అబ్దుల్ కలాం వ్యవస్థాపక అధ్యక్షులు ఆళ్ళ ప్రవీణ్అన్నారు.

దీనిపై జిల్లా కలెక్టర్ జిల్లా సహకార శాఖ అధికారులు మూడు కోట్ల రూపాయలు రాబట్టడానికి అన్ని చర్యలు తీసుకోవాలని అవినీతి అధికారులకు కొమ్ముకాస్తున్నజిల్లా కేంద్ర సహకార బ్యాంకు పాలకవర్గంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో అంబేద్కర్ సేవాసమితి జిల్లా కోఆర్డినేటర్ బండి అప్పారావు, మత్స్యకారుల సేవా సంఘం నాయకులు వాసుపల్లి తాతయ్యలు పాల్గొన్నారు..

# అమరావతి రైతులు పాదయాత్రను ఆపడానికి ఇదేమైనా వైసీపీ నాయకుల అడ్డా



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అమరావతి రైతులు చేపట్టిన మహా పాదయాత్రను అనకాపల్లి జిల్లా పొలిమేరలో అడ్డుకునేందుకు ఈ ప్రాంత ప్రజల సిద్ధంగా ఉన్నారని గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ మాట్లాడడం ఈ ప్రాంతం జగన్ రెడ్డి అడ్డానా లేక మీ జాగీర్దార మీ ఇష్టం వచ్చినట్లు ప్రకటన చేస్తే ఊరుకునేది లేదని మాజీ శాసనమండలి సభ్యులు అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నాగ జగదీష్ ఒక ప్రకటనలో బొడ్డేడ ప్రసాద్ ని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ నాయకుడు బుద్ధ వెంకన్నను నాలుక కోస్తాను వంటి మాటలు మాట్లాడితే తెలుగుదేశం శ్రేణులు తగిన బుద్ధి చెబుతుందని నాగ జగదీష్ అన్నారు.

ఉత్తరాంధ్ర పై దండయాత్ర అంటూ ప్రాంతాల మధ్య విద్వేషం రగిలించి రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం చేయడం అసమర్థ వైసిపి మంత్రులకు చెల్లిందని రెండు నాలుకల ధోరణితో మాట్లాడే నీచపు సంస్కృతికి స్వస్తి పలికి అమరావతిని రాజధానిగా కొనసాగించాలని లేని పక్షంలో అసెంబ్లీని రద్దు చేసి మూడు రాజధానులు ఎజెండాతో ముందుకు వచ్చి ఎన్నికలకు సిద్ధం కావాలని నాగ జగదీష్ సవాలు విసిరారు. జగన్ పాదయాత్రలు చేస్తే ప్రజల కోసం చేసినట్టా భూములు కోల్పోయిన రైతులు పాదయాత్రను దండయాత్రగా ఉన్మాదయాత్రగా పోల్చడం ఒక్క వైసీపీ మంత్రులు గుడివాడ అమర్నాథ్, ధర్మాన ప్రసాదరావు, స్పీకర్ తమ్మినేని సీతారాం లకే దక్కిందని జగదీష్ మండిపడ్డారు. అమరావతి దెయ్యాల రాజధాని మంత్రులు వ్యాఖ్యానం చేయడం ఒకప్పుడు దేవతల రాజధాని అమరావతిని దెయ్యాలరాజధాని అనడం వారి అహంకారానికి అజ్ఞానానికి డబ్బు మదానానికి నిలువటద్దమని జగదీష్ అన్నారు. వికేంద్రీకరణ పేరుతో అన్ని ప్రాంతాల అభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ మంత్రులు ఈ మూడేళ్ల పరిపాలనలో ఉత్తరాంధ్రను ఉద్ధరించింది ఏమిటో సెలవిస్తారా బొత్స సత్యనారాయణ, అమరనాథ్, ధర్మాన ప్రసాదరావు, ముగ్గురు మంత్రులు అన్ని ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉంటే ఉత్తరాంధ్రలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు అయినా పూర్తి చేసి అదనంగా ఒక ఎకరానికైనా సాగునీరు ఇచ్చారా అని ప్రశ్నించారు. మంత్రులు , కొత్తగా ఒక్క పరిశ్రమ అయినా తెచ్చారా విశాఖ మెట్రో రైలు అటకెక్కింది ,గిరిజన యూనివర్సిటీ లేదు, రైల్వే జోన్ అడ్రస్ లేదే లేదు .ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్యాకేజీ ఒక కలగానే మిగిలిపోయింది .ఈ మూడు ఏళ్లలో, జగన్ పాదయాత్రలో మూతపడ్డ చక్కెర ఫ్యాక్టరీలను తెరిపిస్తామని రైతులకుగొప్పగా ఇచ్చిన హామీ ఏమైంది . విశాఖ పరిపాలన రాజధాని వస్తుందని మభ్యపెట్టి పెద్ద ఎత్తున విలువైన భూములు ఇప్పటికే కబ్జా చేశారు విశాఖ నగరంలో తహసిల్దార్ కార్యాలయం, ప్రభుత్వ కంటి ఆసుపత్రి, వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం, ప్రభుత్వ ఉద్యో క్వార్టర్స్ కాళీ చేయించి15 ఎకరాల భూమి వేలానికి పెట్టాలని నిర్ణయించింది మీరు కాదా, గంగవరం పోర్ట్ లో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న వాటా 10.39% దీని విలువ 32 వేల కోట్లు కాగా అధాని సంస్థకే కారు చౌకగా 646 కోట్లకి ఇప్పటికే అమ్మేశారు విలువైన ఆస్తుల బ్యాంకుల్లో కుదవ పెట్టడం తప్ప ఒక్క అభివృద్ధి పని అయిన విశాఖపట్నంలో చేశారా ఉంటే సెలవు ఇవ్వండి అని పత్రికా ముఖంగా సవాలిసిరారు. వికేంద్రీకరణ నాటకాలకు స్వస్తి పలికి ప్రాంతాల అభివృద్ధికి పాటుపడాలని నాగ జగదీష్ హితవు పలికారు.

# రుణాలకు సహకరించని బ్యాంకుల్లో డిపాజిట్లు వెనక్కి



**విజయనగరం:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్దిదారులకు అందించి వారి జీవనోపాదులను మెరుగుపడేలా బ్యాంకు అధికారులు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఎ. సూర్య కుమారి తెలిపారు. కాగితాల పై రుణాలు మంజూరు అవుతున్నాయి కాని లబ్ది దారులకు ఆ నగదు అందడం లేదని , చిన్న చిన్న కారణాలతో నగదు అందించడం లేదని, ఆశించిన లబ్ది జరగనప్పుడు ఇలాంటి సమావేశాలు ఎందుకని బ్యాంకర్ల పై ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇలాంటి పరిస్థితులు వలసలకు దారి తీస్తాయని అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరం లో శుక్రవారం జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. సంక్షేమ పథకాల క్రింద రుణాలు అందించడానికి ముందుకు రాని బ్యాంకులనుండి ప్రభుత్వ డిపాజిట్లను వెనక్కు తీసు కుంటామని హెచ్చరించారు. లబ్దిదారులు ముఖ్యంగా మహిళలు బ్యాంకు ల చుట్టూ తిరిగే పరిస్థితి మంచిది కాదని, వారికీ ఋణం అందించక పోగా వారి సమయాన్ని వృధా చేస్తూ వారి ఆదాయానికి నష్టం కలిగించే పరిస్థిని సహించేది లేదని అన్నారు. గైడ్ లైన్స్ రాలేదని బ్యాంకు ల చుట్టూ తిప్ప వద్దని, ఏ ఒక్కరిని నిరాశ పరచాకూడదని తెలిపారు. సంక్షేమ పథకాల గ్రౌన్డింగ్ కోసం ప్రత్యేకంగా మంగళ, బుధవారాలను కేటాయించాలని, ఆ రెండు రోజుల్లో వారి వీలును బట్టి లబ్ది దారులు బ్యాంకులకు వస్తారని, వారి నుండి అవసరమగు ధ్రువ పత్రాలను తీసుకొని పథకాలను గ్రౌన్డింగ్ చేయడానికి ప్రత్యేక అధికారి ఒకరు పని చేయాలనీ సూచించారు. వై.ఎస్.ఆర్. చేయూత, జగన్న తోడు తదితర పథకాలలో తక్కువగా గ్రౌన్డింగ్ చేసిన బ్యాంకు వివరాలను చదివి ఇక పై పురోగతి లేకపోతే మా నుండి మీకు ఎలాంటి సహకారం ఉండదని వారిని ఉద్దేశించి అన్నారు. అదే విధంగా రుణాలు పొందిన వారి నుండి రికవరీ బాధ్యతను అధికారులు తెసుకోవాలని, తిరిగి చెల్లిస్తేనే వడ్డీ రాయితీ తో పాటు, మరల రుణాలను పొందగలరని ముందే చెప్పాలని సూచించారు. బ్యాంకర్ల తో ప్రతి నెల జరిగే సమావేశాలకు జిల్లా అధికారులే స్వయంగా హాజరై, వారి పథకాల గురించి చర్చించి దరఖాస్తులను గ్రౌన్డింగ్ చేయించాలన్నారు. ఏ.పి.ఎం.ఐ.పి , ఉద్యాన శాఖల యూనిట్ లను వెంటనే గ్రౌన్డింగ్ జరిగేల చూడాలని అదే విధంగా మత్స్య శాఖ యూనిట్లకు రుణాల కోసం బ్యాంకు గ్యారంటీ లు అడుగుతున్నారని, అలాంటి బెరాలాడవద్దని, అర్హులైన వారందరికీ నిబంధనల మేరకు రుణాలు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసారు. స్కేల్ అఫ్ ఫైనాన్సు వివరాలను ఆర్.బి.కే లలో ప్రదర్శించాలని సూచించారు.

జామి మండలం బీమాలి లో నిర్వహిస్తున్న మామిడి తాంద్ర , పచ్చళ్ళు తదితర ఉత్పత్తులు మంచి రుచిగా ఉంటూ నాణ్యంగా ఉంటాయని, అయితే ప్యాకింగ్, స్టోరేజ తదితర అంశాలు సరిగ్గా జరగడం లేదని దానివలన మంచి ధర అందడం లేదని అన్నారు. శాస్త్రీయ పద్ధతి లో ప్యాకింగ్, స్టోరేజ ఉంటే ఆకర్షణీయంగా ఉంటుందని ఇందులో తగు శిక్షణ నిచ్చి ప్రోత్సహించాలని డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కళ్యాణ చక్రవర్తి కి సూచించారు.

స్కిల్ డెవలప్మెంట్ క్రింద శిక్షణలు పెంచాలని, దీనివలన ఉపాధి లేదా స్వయం ఉపాధి అవకాశాలు పెరగడం తో జీవనోపాదులు మెరుగుపడతాయని తెలిపారు. ఫైనాన్సియల్ లిటరసీ పై సచివాలయ స్థాయి లో శిక్షణలు ఇవ్వాలని , అందుకోసం ఒక షెడ్యూల్ తయారు చేయాలనీ ఎల్.డి.ఎం శ్రీనివాస రావు కు కలెక్టర్ సూచించారు.

ఈ సమావేశం లో సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్, రిజర్వు బ్యాంకు ఎల్.డి.ఓ రెహమాన్, నాబార్డ్ డి డి ఎమ్ నాగార్జున , పలు బ్యాంకు లకు చెందిన ప్రతినిధులు , జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కాళ్ల వద్దకే ఉపాధి అవకాశాలు - సద్వినియోగం చేసుకోండి






**పాడేరు, (విశాఖ సమాచారమ్):** జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా ద్వారా మన కాళ్ళ వద్దకే ఉపాధి అవకాశాలు వచ్చాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలు పొందాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ నిరుద్యోగ యువతకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 11 సంస్థలలో వివిధ క్యాతగిరీలలో 770 ఖాళీలను భర్తీ చేయటానికి ఏర్పాటు చేసిన ఈ జాబ్ మేళాలో అపోలో ఫార్మసీ, మథర్ అండ్ ఫాథర్ నర్సింగ్ సర్వీసెస్, ఎస్బీఐ కార్డ్స్, వరుణ్ మోటార్స్, పేటిఎం సర్వీసెస్, దక్కన్ కెమికల్స్, అరబిందో ఫార్మాస్యూటికల్స్, హెటేరో డ్రగ్స్, నవత రోడ్ ట్రాన్స్పోర్ట్స్, ఎంఎస్ఎన్ ల్యాబరేటరీస్, మోహన్ స్పింటెక్స్ మొదలగు 11 సంస్థలు పాల్గొని ఉపాధి అవకాశాలు కల్పించటం ఆనందదాయకమన్నారు. తక్కువ జీత%శ% వస్తుందని లేదా దూర ప్రాంతంలో ఉపాధి లభిస్తుందని నిరుత్సాహ పడకుండా ముందుగా విధులకు జాయిన్ కావాలని కలెక్టర్ సూచించారు. తదుపరి ఆ రంగంలో కష్టపడి నైపుణ్యాలను మరింత మెరుగు పరచుకోవాలని, ఆయా రంగాలలో ఉన్న అదనపు కోర్సులు చేయాలని తద్వారా మరింత ఉన్నతమైన స్థానం పొందటానికి, జీతం పెరుగుదలకు ఆశ్కారం లభిస్తుందని వివరించారు. అంతే కాక విదేశాలలో కూడా ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. మైదాన ప్రాంతాల వలే మన జిల్లాలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా లేనందున, స్వంత ఊరిలో కాకుండా భయటకు వెళ్లి కస్టపడితేనే ఉపాధి అవకాశాలు లభిస్తాయన్న విషయం ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. తక్కువ జీతంతో బతకలేమన్న ఆలోచన మాని క్రమశిక్షణ, కష్టపడే తత్వం అలవాటు చేసుకుంటే జీవితం సుఖవంతమవుతుందని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీల నుండి వచ్చిన హ్యూమన్ రిసోర్సెస్ అధికారులు ఎంపిక చేసుకున్న యువత నైపుణ్యాల మెరుగుకు అవసరమైన శిక్షణలు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.

జిల్లా ఎస్పి సతీష్ కుమార్ మాట్లాడుతూ, భర్తీ చేయాల్సిన ఖాళీలు మించి అభ్యర్థులు హాజరైనందున అందరికీ ఉపాధి లభించే అవకాశాలు లేనప్పటికీ ప్రతి ఒక్కరూ తనకే ఉపాధి లభిస్తుందనే నమ్మకంతో పోటీ తత్వంతో ఇంటర్వ్యూలో పాల్గొనాలని సూచించారు. అదేవిధంగా ఎంపిక కాని వారు నిరుత్సాహ పడకుండా మళ్ళీ మళ్ళీ ప్రయత్నించాలని కోరారు. ఎంపికైన వారు కస్టపడి పని చేయటం అలవాటు చేసుకోవాలని, సంకోచం, ఆత్మ న్యూనత విడనాడాలని సూచించారు.

కార్యక్రమం లో భాగంగా కళాశాల ఆవరణలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ సతీష్ కుమార్, స్థానిక సర్పంచ్ ఉషారాణి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారిణి డా. పి రోహిణి, సీడ్ ఎపి జెడిఎం కల్యాణి, జిల్లా ఉపాధి కల్పనాధికారి సంగీత, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి చిట్టబ్బాయి తదితరులు పాల్గొన్నారు. మరియు ఈ జాబ్ మేళాలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారిణి డా. పి రోహిణి మాట్లాడుతూ ఈ జాబ్ మేళాకు 1620 మంది హాజరు కాగా 314 మంది ఎంపిక అయ్యారని తెలిపారు.

# అక్టోబర్ నాటికీ లబ్ధిదారులకు గృహాలు



**పార్వతీపురం మన్యం, (విశాఖ సమాచారమ్):** అక్టోబర్ నాటికీ గృహ లబ్ధిదారులకు అందించేందుకు ప్రణాళి లకు సిద్ధం చేస్తున్నారని ఏ.పి.టిడ్కో చైర్మెన్ .జమ్మాన ప్రసన్న కుమార్ అన్నారు. మంగళగిరి, తెనాలి, చిలక లూరిపేట మునిసిపాలిటీ పరిధిలోను గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో (అడవి తక్కేల పాడు)లో ఏ.పి.టిడ్కోద్వారా నిర్మిస్తున్నటు వంటి గృహసముదాయాలను టిడ్కో ఇంజనీర్లుతో కలిసి పురోగతిని పరిశీలించడం జరిగింది. నిర్మాణము లో ఉన్నటువంటి టిడ్కో హౌసింగ్ ప్రాజెక్ట్ యొక్క సత్వర పూర్తిపై సంభందిత కాంట్రాక్టింగ్ ఏజెన్సీ వారితోనూ మరియు ఇంజనీరింగ్ సిబ్బందితోను విపులముగా చర్చించారు.మంగళగిరిలో 1728 తెనాలిలో 1856 చిలకలూరిపేటలో 552 గుంటూరులో 7472 మొత్తము మీద 16576 వై.యెస్.ఆర్ జగన్నన్న నగర్ జింత్రీ గృహ సముదాయాలను టిడ్కో ఇంజనీర్ల మునిసిపల్ అధికారులతో కలసి పరిశీలించడం జరిగింది, మొత్తం గృహాలను 2576 గృహాలను సెప్టెంబర్ నెలాఖరునాటికి మిగిలిన గృహాలు పూర్తి స్థాయి సదుపాయాలతో అక్టోబర్ - 2022 నాటికి లబ్దిదారులకు అందించేవిధముగా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను కోరారు .అదే విధముగా రాష్ట్రములో ఏ.పి.టిడ్కో ద్వారా నిర్మాణం చేపట్టినటు వంటి అన్ని పురపాలక సంఘాలలో పర్యావరణం పరిరక్షించే విధముగా అవలంభించే విధముగా బయో ఫెన్సింగ్ ను ఏర్పాటు చేస్తూ వన్ మిలియన్ మొక్కలు నాటి లబ్ధిదారులకు అందించే విధముగా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు తెలియజేయడం జరిగింది. నిర్మాణం లో ఉన్నటువంటి పై పట్టణాలలో గల గృహసముదాయాలను పరిశీలించిన తరువాత ప్రాజెక్ట్ త్వరితగతిన నిర్మాణం పూర్తిస్థాయిలో ఇళ్లను లబ్దిదారులకు అందజేత అనేటటువంటి విషయాలపై విలువైనటువంటి సూచనలను సంబంధిత అధికారులకు ఇవ్వడం జరిగింది. ఇండ్లతో పాటు మౌళిక సదుపాయలైన వాటర్ సప్లై, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు, గ్రీనరీ ఎలెక్ట్రిఫికేషన్ మరియు మురుగు కాలువలు ఏర్పాటు చేస్తూ చక్కటి పర్యావరణములో ఇళ్ళు అందజేసే విధముగా కార్యాచరణను రూపొందించాలని అధికారులకు తెలపడమైనది. టిడ్కో హౌసింగ్ లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా ఋణసదుపాయం కల్పించే విషయంలో మెప్మా డిపార్ట్మెంట్ , డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ ఆఫ్ బ్యాంక్ లింకేజ్ టిడ్కో సి.ఎల్.టి.సి అందరూ సమనవ్యయము చేసుకొంటూ లబ్దిదారులకు ఋణమంజూరులో తమ వంతు కృషి చేయాలని కోరడమైనది.పైన తెలిపిన ఈ కార్యక్రమంలో ఆయా పురపాలసంఘం కమీషనర్లు, ఛైర్పర్సన్లు, ,టిడ్కో సూపరింటెండెంట్ ఇంజనీర్ చిన కోటేశ్వర రావు, ఎక్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసాదరావు డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటాద్రి కాంట్రాక్టింగ్ ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

# సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషిచేయాలి



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్డీజీ గోల్స్) సాధనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని, వీటిపై గౌరవ ముఖ్యమంత్రి ప్రత్యేకంగా దృష్టిసారించిన నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు లక్ష్యాల సాధనకు కృషిచేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కోర్టుహాల్‌లో ఐరాస సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో జిల్లాలో పురోగతిపై కలెక్టర్ డా. కృతికా శుక్లా.. ప్రణాళిక, విద్య, ఆరోగ్యం, గ్రామీణ నీటిసరఫరా, ఐసీడీఎస్, మునిసిపల్, వ్యవసాయం, అటవీ తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెకెవర్ మాట్లాడుతూ 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు సంబంధించి మన పరిధిలోని సూచికల లక్ష్యాల సాధనకు వివిధ శాఖలు ప్రణాళికాయుత కార్యాచరణ చేపట్టాలన్నారు. పేదరిక నిర్మూలన, ఆహారభద్రత, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, స్వచ్ఛమైన తాగునీరు, పారిశు ద్ధ్యం, అసమానతల తగ్గింపుబీ బాధ్యతాయుత వినియోగం, ఉత్పత్తిబీ శుద్ధ ఇంధనం తదితర విభాగాల పరిధిలో నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే కొన్ని లక్ష్యాలను చేరుకున్నా.. మరికొన్నింటిలో పురోగతి సాధించాల్సి ఉందన్నారు. చిన్నారులు, కిశోర బాలికలు, గర్భిణీల ఆరోగ్య పరీక్షలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. పాఠశాలల్లో డ్రాపవుట్‌లను గుర్తించి.. తిరిగి చేరేలా చూడాలన్నారు.

ఈ విషయంలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటీర్ వ్యవస్థల సహకారం తీసుకోవాలని సూచించారు. జిల్లాలో హరిత విస్తీర్ణం పెంపునకు ఉన్న అవకాశాలను గుర్తించి, ఆ దిశగా కృషిచేయాలని సూచించారు. రెండేళ్లకోసారి నిర్వహిస్తున్న భూగర్భ జల సర్వేలో వెల్లడైన అంశాలను క్షుణ్నంగా పరిశీలించి.. భూగర్భ జల వనరుల నిర్వహణ పరంగా ఏమైనా సమస్యలుంటే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యర్థాల నిర్వహణ, వరి దిగుబడి, ఉన్నత విద్య ప్రవేశాలు, గృహ నిర్మాణం, గర్భిణుల ఆరోగ్యం, పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు తదితరాలపై కలెక్టర్ కృతికా శుక్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో సీపీవో పి.త్రినాథ్, కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, డీఎఫ్‌వో ఐవీకే రాజు, హౌసింగ్ పీడీ బి.సుధాకర్ పట్నాయక్, డీఎంహెచ్‌వో డా. ఆర్.రమేష్, ఎల్‌డీఎం సీహెచ్ఎస్‌వీ ప్రసాద్, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, పీఆర్ కళాశాల ప్రిన్సిపల్ డా. బి.వెంకటతిరుపాణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వస్తు వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన సదస్సు




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఇంటిగ్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్డ్ మేనేజ్మెంట్ (ఐఐఏఎమ్) బిజినెస్ స్కూల్ పిజిడిఎం ప్రోగ్రామ్ను అందిస్తోంది, ప్లాస్టిక్ను అంగీకరించవద్దు లేదా ఇవ్వవద్దు అని చెప్పే (ఎస్ ఏ పి) విద్యార్థులకు ప్లాస్టిక్ వస్తు వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన కల్పించడం ద్వారా ప్లాస్టిక్ నిర్మూలన లక్ష్యాన్ని చేపట్టింది. ఐఐఏఎమ్ రెండు మరియు నాలుగు చక్రాల వాహనాలపై పేపర్ స్టిక్కర్లను ముద్రించింది మరియు వాహన యజమాని అతను లేదా ఆమె ప్లాస్టిక్ వాడకానికి వ్యతిరేకంగా పోరాటంలో చేరడానికి అంగీకరిస్తే అన్ని వాహనాలు మరియు స్టిక్కర్లు లను వారి వాహనాలకు అతికించడం జరుగుతుంది. ఈ స్టికర్ లను శ్రీ పైడా కృష్ణ ప్రసాద్ గారు, ప్రెసిడెంట్ ఎ.పి.ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా పైడా కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించడం ప్రతి పౌరుని బాధ్యత అని తెలియజేశారు. ఐఐఏఎమ్ డీన్ మరియు కార్యదర్శి బిజినెస్ స్కూల్ విద్యార్థులు అన్ని వాహనాలపై స్టిక్కర్లను అతికించడం ద్వారా ప్లాస్టిక్ నిర్మూలించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని, విద్యార్థులు కూడా అన్ని కళాశాలలను సందర్శించి విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలన చేయాల్సిన పోరాటంపై అవగాహన కల్పిస్తారని చెప్పారు.

# ఫైర్ స్టార్టర్ కార్యక్రమంలో పాల్గొంటున్న ఏయూ ఆచార్యులు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆచార్యులు అమెరికాలోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయం పర్డ్యు యూనివర్సిటీని సందర్శించనున్నారు. ఈ నెల 18 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు వీరు పర్డ్యు యూనివర్సిటీలో నిర్వహించే ఫైర్ స్టార్టర్ కార్యక్రమంలో పాల్గొంటారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌తో పాటు ఫార్మశీ కళాశాల నుంచి ఆచార్య జి.గిరిజా శంకర్, ఆచార్య కె.ఈశ్వర్ కుమార్, సివిల్ ఇంజనీరింగ్ నుంచి ఆచార్య సి.ఎన్.వి సత్యనారాయణ రెడ్డి, మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగం నుంచి ఆచార్య పి.జానకీరామ్, ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సిఈఓ టి.వి రవి ఈశ్వరపులు పాల్గొంటారు. ఈ సందర్భంగా వీరిని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో ఏయూ సంయుక్తంగా కలసి పనిచేస్తోందన్నారు. ఇటువంటి అవకాశాలను ఆచార్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రపంచవ్యాప్తంగా స్టార్టప్, ఇంక్యుబేషన్, ఎంటర్ ప్యూనర్‌షిప్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో దీనికి అనువైన ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేసామన్నారు. విద్యార్థులను స్టార్టప్ ఇంక్యుబేషన్ దిశగా నడిపించడానికి ఈ ఫైర్ స్టార్టప్ కార్యక్రమం ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఫార్మశీ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య కె.వి రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# నింగిని తాకుతున్న కూరగాయల ధరలు



## గగ్గోలు పెడుతున్న కొనుగోలుదారులు
## అరకులోయ రైతు బజార్లు పర్యవేక్షించని అధికారులు

**అరకులోయ, (విశాఖ సమాచారమ్):** ప్రముఖ పర్యాటక కేంద్రమైన ఆంధ్రా ఊటీ అందాల అరకులోయ పట్టణం లోని రైతు బజార్ లో కూరగాయల ధరలు నింగిని తాకుతున్న యి. ఏ ప్రాంతంలో కూడా లేని విధంగా ఇక్కడి బజార్లో కూరగాయల ధరలు నింగిని తాకుతు ఉండడంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. రైతు బజార్ ల నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ రైతు బజార్ లో కూరగాయల అమ్మకాలు జరుగుతున్నాయని ఎప్పటికప్పుడు కొనుగోలుదారులు గగ్గోలు పెడుతూనే ఉన్నారు. వాస్తవానికి రైతు బజార్ అంటేనే తక్కువ ధరలకు కూరగాయలు లభించే కేంద్రం. అయితే అరకులోయ రైతు బజార్ లో మాత్రం కూరగాయల ధరలు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. రైతు బజార్ లో కూరగాయల ధరలు తక్కువగా ఉంటాయన్న నమ్మకం తో వస్తున్నామని అయితే ఇక్కడ ధరలు చుక్కలు చూపిస్తున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. ప్రస్తుత సీజన్లో వివిధ కూరగాయల ధరలు మైదాన ప్రాంతాలలో తక్కువగానే ఉన్నప్పటికీ ఇక్కడ మాత్రం ఎక్కువ ధరకు అమ్మడం విచారకరమని వినియోగదారులు పేర్కొంటున్నారు. ఏ కూరగాయ ముట్టుకున్న కి లో 60 రూపాయలకు పైగానే చెబుతున్నారని ఇలా అయితే ఏమి కొనగల మని.. ఏం తినగల మని ప్రజలు అంటున్నారు. ఈ ప్రాంతంలో పండే కూరగాయల ధరలు కూడా ఎక్కువగానే ఉంటున్నాయని వినియోగదారులు చెబుతున్నారు. అరకులోయ రైతుబజార్ కు అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వలన వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయిం చి అమ్మ కా లు సాగిస్తున్నారని వినియోగదారుల జేబులకు చి ల్లులు పెడుతున్నారని ఈ ప్రాంత ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. బహిరంగ మార్కెట్లో కూరగాయల ధరలు పెరిగినప్పుడు ధరలు పెంచి అమ్మే వ్యాపారులు ధరలు తగ్గినప్పుడు ఎందుకు తగ్గించి అమ్మడం లేదని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.

# అర్హత గల పౌరులను ఓటర్ల జాబితాలో నమోదు చేయాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** అర్హత గల పౌరులను ఓటర్ల జాబితాలో నమోదు చేయాలని జాయింట్ కలక్టర్ కె.యస్.విశ్వనాథన్ తెలిపారు. శు క్రవారం ఉదయం కలక్టరేట్ సమావేశ మందిరంలో ఇతర రాష్ట్రాలకు చెందిన నివాసితుల సంస్థల ప్రతినిధులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలక్టర్ మాట్లాడుతూ నిష్పక్షపాత ఎన్నికల కోసం, ఖచ్చితమైన మరియు తప్పులు లేని ఓటర్ల జాబితా ముందస్తుగా సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఓటర్లు మెరుగైన భాగస్వామ్యానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియలను మెరుగుపరచడం చాలా అవసరమని, ఇది ఎన్నికల జాబితా యొక్క విశ్వసనీయతను పెంచుతుందన్నారు. ప్రతి ఒక్క నియోజకవర్గానికి ఎలక్షన్ రిజిస్ట్రేషన్ అధికారిని నియమించడం జరిగిందని, ఓటర్ల జాబితాల తయారీ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎలక్టోరల్ రోల్లో కొత్తగా ఓటు నమోదు కోసం ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఓటర్ల జాబితా లో నమోదై ఉన్న వ్యక్తి ఇంటి చిరునామా, నియోజకవర్గ పరిధి వంటి మార్పులకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేసారు. ఆధార్ లేని యెడల ఎన్నికల కమిషన్ వారు ఫారం 6 బి నందు తెలియ చేసిన 11 గుర్తింపు ధృవపత్రాలలో ఏదైనా ఒకదానిని వారి ఓటరు జాబితా ప్రమాణీకరణ కొరకు సమర్పించ వలసియుండునని స్పష్టం చేశారు. ఓటరుతో ఆధార్ అనుసందానం ఆన్లైన్ నందు ఎన్నికల కమిషన్ వారి NVSP, Voter Help Line , Voters Portal నందు లేదా అఫ్ లైన్ ద్వార ఇంటికి వచ్చు BLO కు గాని సంబంధిత ERO లేదా AERO కార్యాలయం లలో గాని సమర్పించవచ్చన్నారు. 17ం ఏళ్ల యువతీ యువకులు ఇప్పుడు ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవడం కోసం ముందుగానే దరఖాస్తు చేసుకోవచ్చునని, యువత తమ అడ్వాన్స్ దరఖాస్తులను తదుపరి మూడు అర్హత తేదీలు అంటే 01 ఏప్రిల్, 01 జూలై మరియు 01 అక్టోబర్ దాఖలు చేయవచ్చునని సూచించారు. ఎన్నికల సంఘం ప్రజాప్రతినిధుల చట్టం మరియు ఎన్నికల నిబంధనల క్రింద జారీ చేసిన ఆదేశాలను జాయింట్ కలెక్టర్ అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస మూర్తి, భీమిలి ఆర్డీఓ భాస్కర్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలక్టర్లు, రెవెన్యూ మరియు ఎన్నికల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అపరిష్కృతంగా ఉన్న ఫిర్యాదులు పరిష్కరించండి



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** వివిద శాఖల్లో అపరిష్కృతంగా ఉన్న ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు . శుక్రవారం ఐటిడి ఏ సమావేశ మందిరంలో ఐటిడిఏ పి ఓ రోణంకి గోపాల క్రిష్ణ , జాయింట్ కలెక్టర్ జె . శివ శ్రీనివాసు , సబ్ కలెక్టర్ వి అభిషేక్ , డి ఆర్ ఓ బి . దయానిధితో కలిసి వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 65 ఫిర్యాదులు స్వీకరించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ రాజ్ , గిరిజన సంక్షేమ శాఖ , గ్రామీణ నీటి సరఫరా విభాగం , రెవెన్యూ తదితర శాఖలలో 151 ఫిర్యాదులు పరిష్కరించ వలసి ఉందని చెప్పారు . వాటిని త్వరగా పరిష్కరించి ఫిర్యాదుదారులకు సమచారం పంపించాలన్నారు . స్పందన రోజు ఉదయం పది గంటలకు జిల్లా అధికారులు హాజరు కావాలన్నారు . అర్థికేతర సమస్యలను జాప్యం చేయకుండా . పరిష్కారం చేయాలని సూచించారు . 3 పాడేరు మండలం గబ్బంగి పంచాయతీకి చెందిన రేగం కొండబాబు దేవరాపల్లి నుండి కొత్తాబు గ్రామం వరకు తారు రోడ్డు నిర్మించాలని వినతి పత్రం సమర్పించారు . పెదబయలు మండలం రూడకోట పంచాయతీ పెద్దకొండ గ్రామస్తులు పి.మన్మధరావు , పి . బాలరాజు తదితరులు పెద్దాపుట్టు నుండి పెద్దకొండ గ్రామానికి తారు రోడ్డు నిర్మించాలని కోరారు . అరకువ్యాలీ మండలం బొండాం గ్రామస్తుడు పూజారి లవకుశ బొండాం గ్రామంలో అంగన్వాడీ భవనం నిర్మించానని బిల్లు మంజూరు చేయాలని ఫిర్యాదు చేసారు పెదబయలు మండలానికి చెందిన పి.సాయిరాణి , లింగేటి పంచాయతీ మూలగరువు గ్రామానికి చెందిన ముష్వల నయోమి స్టాఫ్ నర్సు ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసారు . హుకుపేట మండలం పట్టాం పంచాయతీ గంగుడి గ్రామం వార్డు మెంబరు డుంబేరి బాలన్న , ఎంపిటిసి , డుంబేరి బాలరాజు సిసి రోడ్డు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు . అనంతగిరి మండలం కోనాపురం సర్పంచ్ గుబాయి అప్పలమ్మ కోనాపురం ఎం పిపి పాఠశాలకు అదనపు ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు . హుకుంపేట మండలం కొట్నాపల్లి పంచాయతీ మారెల గ్రామస్తుడు కిరసాని డాంబన్న వృద్ధాప్య పింఛను కోసం దరఖాస్తును సమర్పించారు . ఈ కార్యక్రమంలో డి ఎఫ్ ఓ వినోద్ కుమార్ , గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఐ . కొండల రావు , ఈ ఈలు డివి ఆర్ ఎం.రాజు , కె . వేణు గోపాల్ , పంచాయతీ రాజ్ పి ఐ యు ఇఇ కె . లావణ్య కుమార్ , రహదారులు భవనాల శాఖ ఇ ఇ బాలసుందర బాబు , జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్.నంద్ , ఉద్యాన వన శాఖ ఉప సంచాలకులు ఎ.రమేష్ కుమార్ , జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా . బి . సుజాత తదితరులు పాల్గొన్నారు.

# వరి సేకరణపై జిల్లా కమిటీ సమావేశం




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** రైతులకు పూర్తి స్థాయిలో ఎంఎస్‌పి అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. రాష్ట్రంలో కనీస మద్దతు ధర పై ఒక్క పైసా కూడా నష్టపోకూడదని ముఖ్యమంత్రి ఆధేశించారని, మిల్లర్, ఏజెంట్ లేదా మరేదైనా మధ్యవర్తి ద్వారా రైతుల దోపిడీని నివారించాలని జాయింట్ కలెక్టర్ కల్పన కుమారి పేర్కున్నారు. ఇ-క్రాప్ బుకింగ్ పక్కగా జరగాలి అని జాయింట్ డైరెక్టర్ వ్యవసాయానికి సూచనలు ఇచ్చారు. గ్రామసభ నిర్వహించడం ద్వారా రైతులకు అవగాహన కల్పించవచ్చు అని, ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయలని సూచించారు. సాంకేతిక సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి నమూనాలను సేకరించాలన ఆదేశాలు జారి చేసారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్‌తో పాటు సివిల్ సప్లైస్ డిఎం, వ్యవసాయ జెడి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# యూత్ ఫర్ గార్బేజ్ ఫ్రీ కార్యక్రమంలో పాల్గొనండి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** "స్వచ్ఛ భారత్" ధ్యేయంగా దేశంలో "స్వచ్ఛ అమృత్" మహోత్సవం కార్యక్రమానికి సంబంధించి విశాఖ నగరంలో "స్వచ్ఛతా లీగ్" నిర్వహించ బడుతుందని, విశాఖ యూత్ ఫర్ గార్బేజ్ ఫ్రీ సిటీగా తీర్చి దిద్దుటకు విశాఖ నగరంలోగల యువతీ యువకులు మన విశాఖ నగరాన్ని చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దాలని జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వి. సన్యాసి రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూత్ ఫర్ గార్బేజ్ ఫ్రీ కార్యక్రమం తేది.17-09-2022న(శనివారం) ఉదయం 6.00 గంటలకు నగరంలో గల భీమిలీ బీచ్, కైలాస గిరి, వై ఎస్ రాజశేఖర రెడ్డి సెంట్రల్ పార్క్, యారాడ బీచ్ ప్రాంతాలందు "స్వచ్ఛతా లీగ్" నిర్వహించబడుతుందని ఆయన అన్నారు. కావున యువతీ యువకులకు, స్వచ్ఛంద సంస్థలు, నివాసిత సంక్షేమ సంఘాలు, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ సంఘాలు, విద్యా సంస్థలు, ఎన్ఎస్ఎస్, ఎన్సిసి ఆర్గనైజేషన్స్ మొదలగు వారు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో నగరంలో గల యువతీ యువకులు స్వచ్ఛందంగా పాల్గొని, విశాఖ చెత్త రహిత నగరంగా తీర్చి దిద్దుటకు సహకరించాలని కోరారు.



VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16,Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345,
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 7013118088, Simhachalam : Cell: 96526 99699, Paravaada : Cell: 77804 33919, Aarilova : Cell: 97050 51389,
Cheedikaada : Cell: 97686 33999.